
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
జయశంకర్ భూపాలపల్లి
శుక్రవారం 25 జూలై 2025



ఎల్లో అలర్ట్


వెంకటాపురం మండలంలో పాలెం ప్రాజెక్టు ప్రధాన కాల్వకు బుంగ పడి వృథాగా పోతున్న నీరు


- ములుగు, భూపాలపల్లి జిల్లాల్లో ముసురు
- మరో నాలుగు రోజులూ భారీ వర్షాలు!
- ములుగు జిల్లాలో 24 గంటల్లో సగటు వర్షపాతం 9.07 సెం.మీ
- వెంకటాపురం మండలంలో అత్యధికంగా 23.52 సెం.మీ
- భూపాలపల్లి జిల్లాలో సగటు వర్షపాతం 5.01 సెం.మీ
- పెరుగుతున్న గోదావరి.. నిండుతున్న ప్రాజెక్టులు


వివరాలు 8వ పేజీలో..


భూపాలపల్లి మండలం మోరంచపల్లి సమీపంలోని పంట పొలాల్లోకి చేరిన వర్షపు నీరు

ములుగు, భూపాలపల్లి జిల్లాల్లో గురువారం కూడా ఎడతెరిపి లేని వాన కురిసింది. దీంతో ములుగు జిల్లాలో అధికారులు నాలుగు రోజులపాటు ఎల్లో అలర్ట్ ప్రకటించారు. మరో నాలుగు రోజులూ భారీ వర్షాలు పడుతాయని అంటున్నారు. ముంపు గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరికలు జారీ చేశారు. ఈ జిల్లాలో 24 గంటల్లో సగటు 9.07 సెం.మీ నమోదైంది. వెంకటాపురం మండలంలో అత్యధికంగా 23.53 సెం.మీటర్ల వర్షం కురిసింది. భూపాలపల్లి జిల్లాలో సగటు వర్షపాతం 5.01 సెం.మీ నమోదైంది. ఈ జిల్లాలో పలు చోట్ల పంట పొలాల్లోకి వర్షపు నీరు వచ్చి చేరాయి. మహదేవపూర్ మండలం కాళేశ్వరం త్రివేణి సంగమం వద్ద గోదావరి నీటిమట్టం 7.30 మీటర్లకు చేరింది. అలాగే ములుగు జిల్లాలోని కన్నాయిగూడెం, వాజేడు, ఏటూరునాగారం, మంగపేట మండలాల్లోని గోదావరం గురువారం స్వల్పంగా పెరిగింది. మరో రెండు రోజులు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ చెబుతుండటంతో గోదావరి ఉధృతి మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు అంటున్నారు. భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని మేడిగడ్డ బ్యారేజీకి వరద ప్రవాహం కొనసాగుతోంది. బ్యారేజీకి ఇన్‌ఫ్లో 2.30లక్షల క్యూసెక్కులుగా నమోదుకాగా గేట్లన్నీ ఓపెన్ చేసి వచ్చిన నీటిని వచ్చినట్లే దిగువకు పంపిస్తున్నారు. ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలంలోని సమ్మక్క సాగర్ ప్రాజెక్టులోకి ఎగువ నుంచి 1,73,140 క్యూసెక్కుల నీరు వస్తుండగా 12 గేట్లు ఎత్తి దిగువకు వదులుతున్నారు. వెంకటాపురం మండలంలోని పాలెం ప్రాజెక్ట్ ఇన్‌ఫ్లో 5,322 క్యూసెక్‌లు కాగా ఔట్‌ఫ్లో 450 క్యూసెక్‌లు ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. అలాగే పాలెం వాగు ప్రాజెక్ట్ పూర్తిగా నిండడంతో బొల్లారం గ్రామ సమీపంలో ప్రధాన కాల్వకు బుంగ పడింది.

ఎన్నికలలో..





- పల్లెల్లో 'స్థానిక' సందడి..
- పోటీకి సిద్ధమవుతున్న ఆశావహులు
- టికెట్ల కోసం నేతలకు దగ్గరయ్యే ప్రయత్నం
- గ్రామాల్లో అనుచరులను కూడగట్టుకునేందుకు విందులు
- వ్యూహరచనలో అధికార పార్టీల ముఖ్య నేతలు

భూపాలపల్లి, జూలై 24 (ఆంధ్రజ్యోతి) : రాజకీయం వేడెక్కుతోంది. రాష్ట్ర ప్రభుత్వం స్థానిక ఎన్నికల నిర్వహణకు సమాయత్తం కావడంతో పార్టీలన్నీ వ్యూహ ప్రతివ్యూహాలకు పదును పెడుతున్నాయి. పరస్పర ఆరోపణలు ప్రత్యారోపణలతో నేతలు కత్తులు నూరుతున్నారు. మరోవైపు ఈ ఎన్నికల్లో తమ అదృష్టాన్ని పరీక్షించుకొనేందుకు పలువురు సిద్ధమవుతున్నారు. జూలై చివరి వారంలో నోటిఫికేషన్ వెలువడే అవకాశం ఉందన్న వార్తలతో జిల్లాలోని 12 మండలాల్లో ఎన్నికల్లో రాజకీయ సందడి నెలకొంది. పోటీ చేసేందుకు తహతహలాడుతున్న ఆశావహులు నేతల ప్రాపకం కోసం అప్పుడే ప్రయత్నాలు ముమ్మరం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ముఖ్యంగా పార్టీ గుర్తుల పై ఎన్నికలు జరిగే జడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాల్లో పోటీ చేయాలన్న ఆలోచనతో ఉన్న పలువురు గ్రామస్థాయి నాయకులు టికెట్ల కోసం ఎమ్మెల్యే, నియోజకవర్గ ఇన్‌చార్జిలు, జిల్లా అధ్యక్షుల దృష్టిని ఆకర్షించేందుకు టచ్‌లోకి వెళ్తున్నారు. అంతేకాకుండా ఎప్పటికప్పుడు తమ తమ గ్రామాల్లో జరుగుతున్న రాజకీయ పరిణామాలు, ప్రత్యర్థి పార్టీల వ్యూహ ప్రతి వ్యూహాలను తమ నేతలతో పంచుకుంటున్నారు. ఎన్నికల్లో పోటీ చేసేందుకు తామెంత సీరియస్‌గా ప్రయత్నిస్తున్నారో సింబాలిక్‌గా చెప్పే ప్రయత్నం చేస్తున్నారు.

వేడెక్కిన గ్రామీణం

స్థానిక సంస్థల ఎన్నికలను రెండు విడతల్లో నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తున్నట్టు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో తొలి విడతలో జడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు జరిగే అవకాశాలు ఉన్నాయి. ఎన్నికల నిర్వహణకు సంబంధించి జిల్లా అధికార యంత్రాంగం కూడా ఇప్పటికే ఎలక్ట్రోరల్ రోల్స్ తుది జాబితాను ఖరారు చేసింది. అయితే.. ఎన్నికల నోటిఫికేషన్ జారీ అయ్యేంత వరకు ఓటర్ల జాబితాలో మార్పులు చేర్పులు చేసుకునే అవకాశం ఉండటంతో గ్రామాల్లో ఆశావహులు స్వయంగా దగ్గరుండి జాబితాలో లేని ఓటర్ల పేర్లను చేర్పించేందుకు ప్రయత్నిస్తున్నారు. అంతేకాదు.. ఆయా గ్రామాల్లోని ఓటర్ల వివరాలను సేకరించి తాను ఎన్నికల్లో పోటీ చేస్తే సహకరించాలని ఫోన్ చేసి కోరుతున్నట్లు తెలుస్తోంది. ఎన్నికలు ఎప్పుడు నిర్వహిస్తారనే విషయంపై ఇంకా స్పష్టత లేకపోయినా ఆశావహుల సందడి మాత్రం గ్రామాల్లో వాతావరణాన్ని వేడెక్కిస్తోంది.

- నేతలను ఆకట్టుకునే ప్రయత్నాలు

స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్ ఇంకా వెలువడక ముందే గ్రామాల్లో ఎన్నికల్లో పోటీ చేయాలనుకుంటున్న ఆశావహులు ఓటర్ల మద్దతును కూడగట్టుకునే దిశగా అప్పుడే పావులు కదుపుతున్నారు. ముఖ్యంగా రొటేషన్ పద్ధతిలో రిజర్వేషన్లు తమకు అనుకూలంగా వచ్చే అవకాశం ఉందన్న ఆశతో ఉన్న కొంతమంది అధికార పార్టీ గ్రామస్థాయి నేతలు వారు పోటీ చేయాలనుకుంటున్న ఎంపీటీసీ జడ్పీటీసీ స్థానాల పరిధిలో ఉన్న కీలక ఓటు బ్యాంకును తమవైపు ఆకర్షించేందుకు వ్యూహాత్మకంగా కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా స్థానిక ఎన్నికల్లో ప్రతి ఓటూ విలువైనదిగా పరిగణిస్తుండటంతో ఆశావహులు యువతను తమ వైపు తిప్పుకొని వారికి విందులు, వినోదాలు ఏర్పాటు చేయడం ద్వారా ఓటర్లను తమకు కట్టుబడి ఉండేలా యువకుల ద్వారా ప్రయత్నాలు సాగిస్తున్నట్లు చెబుతున్నారు. ఈ క్రమంలోనే బూత్‌ల వారీగా తిరుగుతూ యువకులు ప్రతి ఇంటి నుంచి ఓటర్లకు సంబంధించిన ఓటర్ ఐడీ సీరియల్ నంబర్లు, మొబైల్

(మిగతా 8వ పేజీలో)

మెరుగైన సౌకర్యాలు కల్పించాలి

కలెక్టర్ రాహుల్‌శర్మ


సమావేశంలో మాట్లాడుతున్న భూపాలపల్లి కలెక్టర్

భూపాలపల్లి కలెక్టరేట్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): సంక్షేమ హాస్టల్స్ విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని కలెక్టర్ రాహుల్‌శర్మ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో విద్యా, బీసీ, ఎస్టీ, ఎస్సీ, మైనారిటీ సంక్షేమ శాఖల అధికారులు, సంబంధిత అధికారులతో ఆయన కలెక్టరేట్‌లో గురువారం సమావేశమయ్యారు. వసతి గృహాల్లో విద్యార్థులకు అందుతున్న విద్యా, భోజనం, వసతులపై సమీక్షించారు. ప్రత్యేక అధికారులు ప్రతి శుక్రవారం విద్యార్థులతో కలిసి భోజనం చేయాలన్నారు. వసతి గృహాలు, పాఠశాలల్లో నాణ్యత ప్రమాణాలు పాటించేందుకు ఆహార కమిటీలను ఏర్పాటుచేయాలన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా విద్యార్థులకు క్రమం తప్పకుండా వైద్యపరీక్షలు నిర్వహించాలన్నారు. ఈకార్యక్రమంలో కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, అదనపు కలెక్టర్లు అశోక్‌కుమార్, విజయలక్ష్మి, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు. అలాగే ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, భూభారతి దరఖాస్తుల పరిశీలనలో వేగం పెంచాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో రెవెన్యూ, గృహ నిర్మాణ, పంచాయతీరాజ్ అధికారులతో ఆయన సమావేశమయ్యారు. కాటారం డివిజన్‌లోని పైలెట్ ప్రాజెక్ట్ మండలాల్లో అన్ని ఇండ్ల నిర్మాణం చేపట్టేందుకు లబ్ధిదారులకు అవగాహన కల్పించాలన్నారు. భూభారతి దరఖాస్తుల పరిశీలనను వేగవంతం చేసి ఆగస్టు 15 నాటిని పూర్తి చేయాలన్నారు. వర్షాకాలం నేపథ్యంలో గ్రామాల్లో పారిశుధ్య కార్యక్రమాలను పకడ్బందీగా నిర్వహించాలన్నారు. సమావేశంలో కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, అదనపు కలెక్టర్లు అశోక్‌కుమార్, విజయలక్ష్మి ఆర్డీవో రవి, హౌసింగ్ పీడీ లోకిలాల్, అన్ని మండలాల తహసీల్దార్లు, ఎంపీడీవోలు తదితరులు పాల్గొన్నారు.

కాటారంలో కలెక్టర్ పర్యటన

కాటారం, జూలై 24 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో కలెక్టర్ గురువారం ఆకస్మికంగా పర్యటన చేశారు. మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతిరావు పూలే బాలుర గురుకులాన్ని, మండల సమాఖ్య కార్యాలయం, రైతు వేదిక, పీఏసీఎస్ గోడౌన్, చిల్డ్రన్స్ పార్క్, ప్రైవేట్ ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. గురుకులంలో పాఠశాల గదులు, వంటశాల, స్టోర్ రూంలను పరిశీలించి కూరగాయల నిల్వలు, ఆహార నాణ్యత, విద్యార్థులు రాసిన ఫీడ్ బ్యాక్ పుస్తకాలను, పరిసరాలను పరిశీలించారు. విద్యార్థుల ఆరోగ్యం దృష్ట్యా వంట గది, సరుకులు శుభ్రంగా ఉంచాలని, మెనూ ప్రకారం భోజనం అందించాలని ఆదేశించారు. విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించి అన్ని సబ్జెక్టుల్లో ముందంజలో ఉండేలా చూడాలన్నారు. పీఏసీఎస్ గోడౌన్, ఎరువుల దుకాణాలను తనిఖీ చేసి స్టాక్‌ను పరిశీలించారు. పలువురు రైతులు యూరియా కోసం రాగా వారితో మాట్లాడారు. జిల్లాలో ఎలాంటి ఎరువుల కొరత లేదని, అపోహపడి యూరియా బస్తాలను నిల్వ చేసుకోవద్దని సూచించారు. ఎరువులను బ్లాక్ చేసినా, అధిక ధరలకు విక్రయించిన చర్యలు తప్పవని హెచ్చరించారు. మండల సమాఖ్య కార్యాలయంలో ఈ కార్యక్రమాల్లో కాటారం సబ్ కలెక్టర్ మయాం క్‌సింగ్, డీఆర్డీవో బాలకృష్ణ, ఇంచార్జి డీఏవో బాపురావు, డీఈవో రాజేందర్, తహసీల్దార్ నాగరాజు, ఎంపీడీవో అడ్డూరి బాబు, ఏడీఏ శ్రీపాల్, ఏవో పూర్ణిమ, ఎంపీవో వీరస్వామి, ప్రిన్సిపాల్ గట్టయ్య, ఏపీఎం లవకుమార్, ఏపీవో వెంకన్న, సీఈవో సతీష్ పాల్గొన్నారు.

మద్యం తాగి లారీ నడిపిన డ్రైవర్‌కు జైలు

ఏటూరునాగారం, జూలై 24 (ఆంధ్రజ్యోతి): డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో భాగంగా మద్యం సేవించి లారీ నడుపుతున్న వ్యక్తికి రెండు రోజుల జైలు శిక్ష విధించినట్లు ఏటూరునాగారం సీఐ అనుముల శ్రీనివాస్ గురువారం తెలిపారు. లారీ డ్రైవర్ రామావత్ శివనాయక్ అతిగా మద్యం సేవించి ఉన్నట్లు తనిఖీల్లో గుర్తించామని వివరించారు. మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు ఉంటాయని సీఐ శ్రీనివాస్, ఎస్సై ఎన్. రాజకుమార్ హెచ్చరించారు.

బొగత అదుర్స్..

- మహోగ్రంగా దూకుతున్న జలపాతం
- నయాగరాను తలపిస్తున్న అపూర్వ దృశ్యం
- సందర్శకులను అనుమతించని అధికారులు

6


వాజేడు వద్ద బొగత జలపాతం ఏరియల్ వ్యూ

నిండుతున్న లక్నవరం

- 25 ఫీట్లకు చేరిన నీటిమట్టం
- మరో 8 ఫీట్లు పెరిగితే మత్తడి దూకనున్న సరస్సు
- బోటింగ్ ప్రారంభానికి సన్నాహాలు

6


లక్నవరం సరస్సు

'తల్లి కోసం ఒక్క చెట్టు' నినాదంతో మొక్కలు నాటాలి

కృష్ణకాలనీ, జూలై 24 (ఆంధ్రజ్యోతి): తల్లీ కోసం ఒక్క చెట్టు అనే నినాదంలో భాగంగా ప్రతి ఒక్కరూ మొక్కలు విరివిగా నాటాలని సింగరేణి ఏరియా ఇన్‌చార్జి జనరల్ మేనేజర్ కవీంద్ర అన్నారు. గురువారం సింగరేణి పాఠశాలలలో ఆయన మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణ, వాతావరణ సమతుల్యత, జీవావరణ వ్యవస్థను సింగరేణి పరిసర ప్రాంతాల్లో స్థాపించడంలో భాగంగా ఖాళీ స్థలాలు, ఓబీలలో మొక్కలు నాటి హరిత సింగరేణిగా తీర్చిదిద్దాలన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని సూచించారు ఈ కార్యక్రమంలో సింగరేణి అధికారులు రవికుమార్, పోషమల్లు, కాపూరి మారుతి, పాఠశాల ప్రిన్సిపల్ ఝాన్సీరాణి, విద్యార్థులు పాల్గొన్నారు.

విజయలక్ష్మి, మార్కెట్ కమిటీ చైర్మన్ కిష్టయ్య, కాంగ్రెస్ నాయకులు నర్సయ్య, తోకల సురేందర్‌రెడ్డి, మేకల భిక్షపతి, ఏనుగు రవీందర్‌రెడ్డి, పున్నం రవి, పట్టెం శంకర్, గట్టు ప్రదీప్, వీరబ్రహ్మం పాల్గొన్నారు.

సీసీ కెమెరాల ప్రారంభం

కొత్తపల్లిగోరి మండలంలోని బాలయ్యపల్లి గ్రామంలో కాంగ్రెస్ యూత్ నాయకులు తొట్ల తిరుప తియాదవ్ ఆధ్వర్యంలో రూ. లక్ష 50 వేలతో సీసీ కెమెరాలను సమకూర్చగా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు ప్రారంభించారు. ఎబి మల్లేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం బాలయ్యపల్లికి చెందిన పలువురు ఆయన సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు.

అర్హులకే సంక్షేమ పథకాలు


ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

రేగొండ, జూలై 24(ఆంధ్రజ్యోతి) : సంక్షేమ పథకాలు అర్హులకు మాత్రమే అందేలా రాష్ట్ర ప్రభుత్వం పారదర్శకంగా వ్యవహరిస్తోందని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. ధనవంతులకు కాకుండా అర్హులైన పేదలకు అందడమే లక్ష్యమన్నారు. కొత్తపల్లిగోరి మండలంలోని చిన్నకోడెపాక రైతువేదికలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు గురువారం ఆయన మంజూరు పత్రాలు అందజేశారు. ఇందిరమ్మ ఇళ్లు రానివారు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ప్రతి ఏటా 3,500 ఇళ్లు మంజూరు చేస్తామన్నారు. ఎవరైనా అర్హత లేకున్నా ఇందిరమ్మ ఇళ్లు పొందితే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. గత ప్రభుత్వం మంజూరు చేసిన డబుల్ బెడ్‌రూం ఇళ్లు పూర్తి కాక పందులు, పశువులకు స్థావరంగా తయారయ్యా యని అన్నారు. అప్పుడు ఆగిపోయిన ఇళ్ల నిర్మాణాలను కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తి చేస్తుందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాకే నియోజకర్గంలో చెరువుల మరమ్మతులు జరగాయన్నారు. బీఆర్ఎస్ హయాంలో చెరువులు తెగిపోతే బస్తాలు అడ్డంవేసి వరదను ఆపిన పాపాన పోలేదని విమర్శించారు. ఈ కార్యక్ర మంలో అదనపు కలెక్టర్


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గండ్ర

ముస్తాబైన కాళేశ్వరాలయం

- నేటి నుంచి శ్రావణ సందడి
- నెల రోజులపాటు లక్షపత్రి పూజలు


కాళేశ్వర ఆలయం

మహదేవపూర్, జూలై 24(ఆంధ్రజ్యోతి) : మండలంలో పుణ్యక్షేత్రమైన కాళేశ్వర ముక్తీశ్వర స్వామి ఆలయానికి భక్తులు పెద్ద ఎత్తున రానున్నారు. శుక్రవారం నుంచి నెలరోజుల పాటు శ్రావణమాస ప్రత్యేక పూజలు ప్రారంభం కానున్నాయి. ఈ మాసంలో లక్షపత్రి పూజలతో పాటు పలు ప్రత్యేక పూజలను భక్తులు జరుపుకుంటారు. జిల్లా నలుమూల నుంచే కాకుండా మన రాష్ట్రంతోపాటు మహారాష్ట్ర, చత్తీస్‌గఢ్ నుంచి వేల సంఖ్యలో భక్తులు తరలిరానున్నారు. త్రివేణి సంగమ గోదావరిలో పుణ్యస్నానాలు ఆచరించి కాళేశ్వర ముక్తీశ్వర స్వామిని దర్శించుకోనున్నారు. శుభానందదేవి, సరస్వతి అమ్మవారు, ఆది ముక్తీశ్వరుడు, సంగమేశ్వరుడు, దత్తాత్రేయుడితో పాటు రామాలయంలో భక్తులు పలు ప్రత్యేక పూజలు నిర్వహించుకుంటారు. శ్రావణమాసంలో గోదావరిలో పుణ్య స్నానాలు ఆచరించి స్వామివారిని దర్శించుకుంటే ముక్తి పొందుతామని భక్తుల నమ్మకం. ఈ సందర్భంగా మహారుద్రాభిషేకం, అమ్మవారికి పూజలు, సరస్వతి అమ్మవారికి పూజలు కూడా భక్తులను నిర్వహిస్తారని అర్చకులు తెలుపుతున్నారు. వారి కోసం ఈవో మహేష్, సిబ్బంది తగిన ఏర్పాట్లు చేస్తున్నారు.



పడవలో జంపన్నవాగు దాటుతున్న ఏఎస్పీ శివం ఉపాధ్యాయ

లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

● ఏఎస్పీ శివం ఉపాధ్యాయ

ఏటూరునాగారం రూరల్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలకు వాగులు, వంకలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయని, లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ములుగు జిల్లా ఏటూరునాగారం ఏఎస్పీ శివం ఉపాధ్యాయ అన్నారు. గురువారం ఆయన మండలంలోని దొడ్ల గ్రామ సమీపంలోని జంపన్నవాగు వరద ఉధృతిని పరిశీలించారు. అనంతరం పడవ ఎక్కి కొండాయికి వెళ్లారు. అక్కడ ప్రజలతో మాట్లాడి ప్రస్తుత పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు.

ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గత మూడురోజులుగా భారీ వర్షాల కారణంగా జంపన్నవాగు ఉధృతంగా ప్రవహి స్తుందని, మల్యాల, కొండాయి గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అత్యావసర పరిస్థితుల్లోనే ప్రజలకు బయటకు రావాలని, ముంపు గ్రామాల ప్రజలకు నిత్యావసర సరుకులను అందించేందుకు పోలీస్‌శాఖ కృషి చేస్తోందని అన్నారు. అత్యావసర పరిస్థితుల్లో ప్రజలు పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. పోలీ సుల సూచనలను ప్రజలు అర్థం చేసుకోవాలని అన్నారు. ఆయనవెంట స్థానిక సీఐ అనుముల శ్రీనివాస్, ఎస్సై రాజ్‌కుమార్ ఉన్నారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య



పోచం(ఫైల్)

కాటారం, జూలై 24(ఆంధ్రజ్యోతి): అప్పుల బాధతో రైతు ఆత్మహత్య చేసుకున్న సంఘటన భూపాలపల్లి జిల్లా కాటారం మండలంలో గురువారం చోటు చేసుకుంది. ఎస్సై శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని చింతకాని గ్రామానికి చెందిన గోల్కొండ పోచం(64) తనకున్న రెండెకరాల భూమితో పాటు మూడెకరాలను కౌలుకు తీసుకుని పత్తి, మిర్చి పంటలు సాగుచేస్తున్నాడు. గత ఏడాది పత్తి, మిర్చి పంటల్లో సరైన దిగుబడులు రాకపోవడంతో పెట్టుబడుల కోసం తెచ్చిన రూ.3 లక్షలు అప్పు అలాగే ఉండిపోయింది. దీంతో మనస్తాపం చెందిన పోచం బుధవారం సాయంత్రం ఇంటి వెనకాల ఎడ్ల కొట్టంలో పురుగుల మందుతాగి అస్వస్థతకుగురై పడిపోయాడు. కొద్దిసేపటి అనంతరం భార్య లక్ష్మి వెళ్లి చూడగా అపస్మారకస్థితిలో కనిపించాడు. దీంతో అతడిని భూపాలపల్లి 100 పడకల ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి కుమారుడు సంతోష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు.

అటవీశాఖ సిబ్బంది సాగును అడ్డుకున్నారని..

గిరిజన మహిళల ఆత్మహత్యాయత్నం



108లో గిరిజన మహిళను తరలిస్తున్న దృశ్యం

ఇనుగుర్తి, జూలై 24 (ఆంధ్రజ్యోతి) : తమను సాగు చేయనీయకుండా అటవీశాఖ సిబ్బంది అడ్డుకుంటున్నారని ఆరోపిస్తూ ఇద్దరు గిరిజన మహిళలు క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన ఇనుగుర్తి మండలం రాముతండా సమీపంలో గురువారం చోటు చేసుకుంది. మధ్యాహ్నం తండాకు చెందిన లకావత్ లాలి, జర్పుల అచ్చమ్మ రాముతండా పరిధిలోని కంపార్ట్‌మెంటు నెంబరు 1143లో సాగు చేసేందుకు వెళ్లగా అటవీశాఖ సిబ్బంది అడ్డుకున్నారు. దీంతో మనస్థాపం చెందిన సదరు మహిళా రైతులు క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశారు. 108 వాహనంలో ఇరువురిని మహబూబాబాద్ జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఈ సందర్భంగా బాధిత మహిళా రైతులు మాట్లాడుతూ తాము గత కొన్ని సంవత్సరాలుగా ఈ భూముని సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నామని తెలిపారు. తమపై అటవీశాఖ సిబ్బంది కేసులు పెడుతున్నారని, తమకు పోడు పట్టాలిప్పించాలని డిమాండ్ చేశారు. ఈవిషయంపై ఎఫ్ఆర్‌వో విజయలక్ష్మి మాట్లాడుతూ అటవీశాఖ ప్లాంటేషన్ ధ్వంసం చేసి కొత్తగా పోడుకు ప్రయత్నిస్తున్నారని తెలిపారు. ఇది అటవీశాఖకు చెందిన భూమి అని స్పష్టంచేశారు.

కొత్త రేషన్ కార్డులకు మోక్షం

నేటి నుంచి పంపిణీకి ప్రభుత్వం ఆదేశాలు



పెద్దవంగర మండలం బొమ్మకల్‌లో సన్నబియ్యం పంపిణీ (ఫైల్)

తొర్రూరు(మహబూబాబాద్ జిల్లా), జూలై 24 (ఆంధ్రజ్యోతి): కొత్త రేషన్‌కార్డుల కోసం గత పదేళ్లుగా ఎదురుచూస్తున్న పేదల కల ఎట్టకేలకు సాకారం అయింది. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం కొత్త కార్డుల పంపిణీకి శ్రీకారం చుట్టింది. దీంతో లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా జిల్లాలో 20,112 కొత్త కార్డులు మంజూరు చేసింది. ఈ కార్డుల్లో 14,992 మందిని అదనంగా సభ్యులుగా చేర్చారు. కాగా ఈనెల 25వ తేదీ నుంచి ప్రభుత్వం మండలాల వారీగా పంపిణీ చేసేందుకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందించారు. మహబూబాబాద్ జిల్లాలో గతంలో 2,26,452 ఫుడ్ సెక్యూరిటీ కార్డులు, 16,750 అంత్యోదయ కార్డులు ఉన్నాయి. వీటికిగాను ప్రభుత్వం జిల్లాలో 564 రేషన్ షాపుల ద్వారా ప్రతీ నెల 4804 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని సరఫరా చేస్తోంది. కాంగ్రెస్ ప్రభుత్వం గత నెలలో నూతనంగా ప్రారంభించిన సన్నబియ్యం పంపిణీ జిల్లా వ్యాప్తంగా సుమారు 14 లక్షల 414 మెట్రిక్ టన్నుల సన్న బియ్యాన్ని పంపిణీ చేసింది.

అర్హులందరికీ రేషన్ కార్డులు

రేషన్ కార్డుల మంజూరు నిరంతర ప్రక్రియ. క్షేత్ర స్థాయిలో రెవెన్యూ అధికారులు విచారణ చేపట్టి ఆన్‌లైన్‌లో నమోదు చేస్తే అర్హులైన వారికి కొత్త కార్డులు మంజూరు చేస్తున్నాం. 25 తేదీ నుంచి మండలాల వారిగా రేషన్ కార్డుల పంపిణీకి ప్రత్యేక ఏర్పాట్లు చేయడం జరుగుతుంది. ఇప్పటికే జిల్లా, డివిజన్ కేంద్రాల్లో ప్రజా ప్రతినిధులు రేషన్ కార్డుల పంపిణీని ప్రారంభి ంచారు.

\- ప్రేమ్‌కుమార్, జిల్లా సివిల్ సప్లై అధికారి

మండలాల వారీగా

జిల్లాలో 16 మండలాల్లో 20,112 కొత్త రేషన్ కార్డులు మంజూరు కాగా కురవి 1128, డోర్నకల్ 1194, చిన్నగూడూరు 273, దంతాలపల్లి 934, మరిపెడ 1790, నర్సింహులపేట 1025, గూడూరు 2185, మహబూబాబాద్ 3381, కేసముద్రం 1898, నెల్లికుదురు 2175, కొత్తగూడ 649, గంగారం 413, పెద్దవంగర 277, తొర్రూరు 1642, గార్ల 534, బయ్యారం 614 కార్డులు మంజూరయ్యాయి. ఇదేకాక పాతకార్డుల్లో కుటుంబ సభ్యు లను వీరితో కలిపి 34వేల మందిని చేర్చడం జరిగింది.

నిరంతర ప్రక్రియ

జిల్లాలో కొత్త రేషన్ కార్డులు నిరంతర ప్రక్రియగా కొనసాగుతాయని అధికారులు తెలుపుతున్నారు. వచ్చిన దరఖాస్తులను విచారణ జరిపి అర్హులను గుర్తించి వారికి రేషన్ కార్డులు అందించడం జరుగుతుందని రెవెన్యూ, పౌర సరఫరాల అధికారులు తెలిపారు. మీసేవ ద్వారా వచ్చిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో రెవెన్యూ అధికారులు పరిశీలించి అర్హులను గుర్తించి పౌరసరఫరా ఆన్‌లైన్‌లో సిఫారసు చేస్తే వారు ఆమోదిస్తున్నారు. కొత్త రేషన్ కార్డుదారులకు సెప్టెంబరు నెలలో సన్న బియ్యం పంపిణీ చేయనున్నారు. జూన్ నెలలోనే మూడు నెలల కోటా పంపిణీ చేసిన నేపథ్యంలో కొత్త రేషన్ కార్డుదారులు సన్నబియ్యం కోసం మరో 45రోజులు వేచి చూడాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి.

ప్రజా ఉద్యమాలను ఉధృతం చేయాలి

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ



గోవిందరావుపేటలో ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

గోవిందరావుపేట, జూలై 24 (ఆంధ్రజ్యోతి): వీరపనేని రామదాసు స్ఫూర్తితో ప్రజా ఉద్యమాలను ఉధృతం చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ పిలుపునిచ్చారు. ములుగు జిల్లా గోవిందరావుపేట మండల కేంద్రంలో గురువారం సీపీఎం ఆధ్వర్యంలో రామదాసు-వెంకటసుబ్బమ్మల ఐదవ వర్ధంతిసభ నిర్వహించగా సీనియర్ నాయకుడు గుండు సత్యనారాయణ పార్టీ జెండాను ఆవిష్కరించారు. అంతకుముందు మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం జరిగిన వర్ధంతిసభలో జాన్‌వెస్లీ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. రామదాసు స్వాతంత్ర్య పోరాటంలో బ్రిటిష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాటాలు నిర్వహించి జైలు జీవితం గడిపారని, కమ్యూనిస్టు ఉద్యమాలను బలోపేతం చేస్తూ రైతు పోరాటాలు చేపట్టారని అన్నారు.

రామదాసు స్ఫూర్తితో నేడు కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న రైతు, కార్మిక వ్యతిరేక విధానాలపై ఉద్యమించాలని, హిందూ మతోన్మాద పోకడలకు వ్యతిరేకంగా లౌకికవాదం, ప్రజాస్వామ్యం కాపాడాలని, అందుకు ప్రజా ఉద్యమాలు నిర్వహించాలన్నారు. మోదీ ప్రభుత్వం మత విద్వేషాలను రెచ్చగొడుతూ అన్ని వర్గాల ప్రజలకు వ్యతిరేకంగా కార్పొరేట్‌శక్తులకు అనుకూలంగా చట్టాలు తయారు చేస్తున్నారని అన్నారు. దేశంలో నేడు విద్య, వైద్యం ప్రజలకు అందుబాటులో లేదని, తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అనేక హామీలిచ్చి మరిచిందని అన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో సీపీఎంపార్టీ బలంగా ఉన్న చోట పోటీ చేయాలని, ములుగు జిల్లాలో నాలుగు జడ్పీటీసీ, 30 ఎంపీటీసీ స్థానాలను కైవసం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు బండారు రవికుమార్, రాష్ట్ర కమిటీ సభ్యులు సూడి కృష్ణారెడ్డి, డీజీ.నర్సింగరావు, జిల్లా కార్యదర్శి బీరెడ్డి సాంబశివ, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు తుమ్మల వెంకటరెడ్డి, పొదిళ్ల చిట్టిబాబు, ఎమ్డీ.దావూద్, కొప్పుల రఘుపతి, గ్యానం వాసు, నాయకులు తీగల ఆదిరెడ్డి, సోమ మల్లారెడ్డి, కుమ్మరి శ్రీను, గొంది రాజేష్, దుగ్గి చిరంజీవి, దామోదర్, కృష్ణబాబు, నర్సింహచారి, గుండు రామస్వామి, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రాంమోహన్ రెడ్డి

స్థానిక ఎన్నికల్లో సత్తాచాటాలి

తొర్రూరు, జూలై 24 (ఆంధ్రజ్యోతి): రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులు అన్ని స్థానాల్లో గెలుపొంది సత్తా చాటాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు లేగ రాంమోహన్ రెడ్డి అన్నారు. గురువారం తొర్రూరులో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని స్థానాల్లో పోటీచేసి విజయం కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. మోడీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం నేరుగా గ్రామ పంచాయతీలకు నిధులు విడుదల చేసి అభివృద్ధికి కృషి చేస్తుందని, గ్రామాల్లో జరిగే అభివృద్ధిలో కేంద్ర ప్రభుత్వ భాగస్వామ్యం ఉందన్నారు. కార్యక్రమంలో బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పూసల శ్రీమాన్, కుమార్, రాజేష్, భాస్కర్, సురేష్, నవీన్, రవితేజ తదితరులు ఉన్నారు.

ముగ్గురు పేకాట రాయుళ్ల అరెస్టు

మహబూబాబాద్ రూరల్, జూలై 24 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ మండలం సండ్రాలగూడెం గ్రామశివారులో పేకాట ఆడుతున్న ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు మహబూబాబాద్ రూరల్ ఎస్సై దీపికరెడ్డి తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం. సండ్రాలగూడెం గ్రామశివారులో కంబాలపల్లి, పాతరెడ్యాల, సండ్రాలగూడెంలకు చెందిన ఆరుగురు వ్యక్తులు పేకాట ఆడుతున్నారన్న పక్కా సమాచారంతో దాడులు నిర్వహించి ముగ్గురిని అదుపులోకి తీసుకోగా.. మరో ముగ్గురు పరారైనట్లు చెప్పారు. వారి వద్ద నుంచి నగదు రూ.7150, రెండు సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ఈ దాడుల్లో ఏఎస్సై రమేష్, కానిస్టేబుళ్ల బాలరాజు, అశోక్ పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో పార్టీ గెలుపే లక్ష్యం

బీజేపీ ములుగు జిల్లా అధ్యక్షుడు బలరాం

ఏటూరునాగారం, జూలై 24 (ఆంధ్రజ్యోతి): రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ సాధించడమే లక్ష్యంగా ప్రతి కార్యకర్తా కృషి చేయాలని బీజేపీ ములుగు జిల్లా అధ్యక్షుడు సరికొండ బలరాం అన్నారు. మండల కేంద్రంలో బీజేపీ మండల అధ్యక్షుడు విలుకొల్లు చక్రవర్తి అధ్యక్షతన గురువారం నిర్వహించిన స్థానిక సంస్థల ఎన్నికల కార్యశాలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ప్రధాని నరేంద్ర మోదీ ప్రవేశపెట్టిన పథకాలను, అభివృద్ధి పనులను ప్రజల్లోకి తీసుకెళ్లి వివరించాల్సిన బాధ్యత ప్రతి కార్యకర్తపై ఉందన్నారు. కార్యకర్తలంతా సమష్టిగా పనిచేసి స్థానిక ఎన్నికల్లో పార్టీ విజయానికి కృషి చేయాలని సూచించారు. గత బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు గ్రామాల్లో ఎలాంటి అభివృద్ధి చేయలేదని, గ్రామీణ ప్రాంతాల్లో స్మశాన వాటికలు, పల్లె ప్రకృతి వనాలు, డంపింగ్ యార్డులు, హరితహారం, వీధిలైట్లు, సిమెంట్ రోడ్లు వంటివన్నీ కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన నిధులతోనే నిర్మించారని, వాటిని కూడా నాసిరకంగా చేసి కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు లబ్ధి పొందారని ఆరోపించారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల మాయమాటలను ప్రజలు నమ్మే స్థితిలో లేరని బలరాం స్పష్టం చేశారు. కార్యక్రమంలో మండల ఇన్‌చార్జి, గిరి జన మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొత్తి సురేం దర్, జిల్లా ఉపాధ్యక్షుడు ఏనుగు రవీందర్‌రెడ్డి, ఎస్టీ మోర్చా జిల్లా అధ్యక్షుడు గండెపల్లి సత్యం, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు వావిలాల జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.



సూర్యతండాలో రోడ్డుపై నిలిచిన వర్షం నీరు

బురదరోడ్డుపై వెళ్లేదెలా ?

● ఇబ్బందులు పడుతున్న తండావాసులు

● పట్టించుకోని పాలకులు

కురవి, జూలై 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నల్లెల సూర్యతండా, తుల్యానాయక్‌కాలనీ వాసులు బురదరోడ్డుతో ఇబ్బందులు పడుతున్నారు. ప్రతీ వర్షాకాలం మట్టిరోడ్డుపై నీరు నిలుస్తోంది. దీంతో బురద ఏర్పడి నడవడానికి ఇబ్బందులు పడుతున్నామని తండావాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వానాకాలంలో నడవలేని పరిస్థితి నెలకొందని వాపోయారు. అయినా ప్రజాప్రతినిధులు పట్టించుకోవడంలేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల స్థానికుడు తేజావత్ నరేష్ ఆధ్వర్యంలో తండావాసులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. నరేష్ మాట్లాడుతూ జీపీలో నిధు లున్నా తండాలో సీసీ రోడ్డు నిర్మించడంలేదని, ఇప్పటికైనా స్పందించి రహదారి వేయించిసమస్యను పరిష్కరించాలని కోరారు.

కుబేర స్థానాన్ని ఆక్రమించిన కేసీఆర్ కుటుంబం

డిప్యూటీ స్పీకర్ రాంచంద్రునాయక్



దంతాలపల్లిలో మాట్లాడుతున్న రాంచంద్రునాయక్

దంతాలపల్లి, జూలై 24(ఆంధ్రజ్యోతి)ధనిక తెలంగాణ రాష్ట్రాన్ని దోచుకొని కేసీఆర్ కుటుంబం కుబేర స్థానంలో ప్రథమంగా నిలిచారని డోర్నకల్ ఎమ్మెల్యే, డిప్యూటీ స్పీకర్ రాంచంద్రునాయక్ అన్నారు. మండల కేంద్రంలోని శ్రీ బాలాజీ ఫంక్షన్‌హాల్‌లో గురువారం జరిగిన నూతన రేషన్‌కార్డుల పంపిణీ కార్యక్రమంలో భాగంగా కార్యకర్తలతో మాట్లాడారు. కేసీఆర్ పదేళ్లలో అందినంత ప్రజల సొమ్మును దోచుకున్నారన్నారు. డోర్నకల్ నియోజకవర్గంలో తాను 18 నెలల్లోనే 5 వందల కోట్ల నిధులను తెచ్చి పలు రకాలుగా అభివృద్ధి పర్చానన్నారు. మరిపెడకు కోర్టు, నర్సింహులపేట, సిరోల్‌కు నూతన పీహెచ్‌సీ భవనాలు మంజూరు చేయించానన్నారు. పెద్దముప్పారం నుంచి కుక్కడంకు వెళ్లేందుకు రోడ్డు నిర్మాణానికి రూ.1.50కోట్లు మంజూరు శ్రీకారం చుట్టనన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ సునీల్‌రెడ్డి, ఎంపీవో మహ్మద్ అప్సర్‌పాష, మండల అధ్యక్షుడు బట్టు నాయక్, పీఏసీఎస్ చైర్మన్ రాము, తదితరులు పాల్గొన్నారు.




ఇనుగుర్తిలో రేషన్‌కార్డులను పంపిణీ చేస్తున్న మురళీనాయక్

పేదల కష్టాలను అర్థం చేసుకునే ప్రభుత్వం

మహబూబాబాద్ ఎమ్మెల్యే మురళీనాయక్

ఇనుగుర్తి, జూలై 24 (ఆంధ్రజ్యోతి): పేదల కష్టాలను అర్థం చేసుకునే ప్రజాప్రభుత్వం కాంగ్రెస్ సారథ్యంలో కొనసాగుతోందని, అందుకే పదేళ్లుగా ఇవ్వని రేషన్‌కార్డులను ఇప్పుడు ఇస్తున్నామని ఎమ్మెల్యే మురళీనాయక్ అన్నారు. ఇనుగుర్తి రైతువేదికలో గురువారం కొత్త రేషన్‌కార్డులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 25 నుంచి వచ్చేనెల 10 వరకు అన్ని మండల కేంద్రాల్లో కొత్త రేషన్‌కార్డుల పంపిణీ ఉంటుందని తెలిపారు. కాంగ్రెస్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారని, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్‌కు మద్దతుగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు భరత్‌చంద్‌రెడ్డి, మార్కెట్ చైర్మన్ గంట సంజీవరెడ్డి, ఎంపీడీవో హరిప్రసాద్, డీటీ బషీర్, కూరెల్లి సతీష్, బైరు అశోక్, గుజ్జునూరి బాబురావు, కొట్టం మహేందర్, కొట్టం రాము పాల్గొన్నారు.



పాలనురగవలె ప్రవహిస్తున్న బొగత జలపాతం

బొగత అదుర్స్..

మహోగ్రంగా దూకుతున్న జలపాతం

నయాగరాను తలపిస్తున్న అపూర్వ దృశ్యం

సందర్శకులను అనుమతించని అధికారులు

వాజేడు, జూలై 24(ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లాలో తెలంగాణ నయాగరాగా పేరుపొందిన బొగత జలహోరుతో ఆకట్టుకుంటోంది. గత రెండు రోజులుగా ఎడతెరిపిలేని వర్షాలతో ఎగువ నుంచి భారీగా వరద నీరు వస్తుండటంతో బొగత జలపాతం ఉప్పొంగి ప్రవహిస్తోంది. కొండలు, వాగులు, వంకలు దాటుకొని మొదట ఎర్ర నీరు ప్రవహించగా, గురువారం పాలనురగ వలె తెల్లటి జలధారలు ఉవ్వెత్తున ఎగిసిపడుతూ అబ్బురపరుస్తున్నాయి. భారీ వర్షాల కారణంగా పోలీసు, ఫారెస్టు ఉన్నతాధికారులు బొగత జలపాతం సందర్శనను ఈ నెల 26వరకు నిలిపివేశారు.

ములుగు జిల్లా వాజేడు మండలంలోని చీకుపల్లి గ్రామ సమీపంలో బొగత జలపాతం కొలువుదీరి ఉంది. ఈ జలపాతానికి వాజేడు మండలంలోని నల్లందేవి, పెద్దవాగుల నుంచి వరద నీరు వస్తుంది. అటవీ ప్రాంతంలోని కొండలు, వాగులు, వంకలను దాటుకుంటూ 30 అడుగుల ఎత్తు నుంచి చీకుపల్లి సమీపంలో ఉన్న బొగతలో కలుస్తుంది. అనంతరం దిగువకు ప్రవహించి గోదావరిలో కలుస్తాయి. ఈ జలపాతం పర్యాటకులను ఎంతగానో ఆకర్షిస్తోంది. జలపాతాన్ని చూసేందుకు దేశ, విదేశాల నుంచి సందర్శకులు వస్తుంటారు.

నిండుతున్న లక్నవరం

● 25 ఫీట్లకు చేరిన నీటిమట్టం

● మరో 8 ఫీట్లు పెరిగితే మత్తడి దూకనున్న సరస్సు

● బోటింగ్ ప్రారంభానికి సన్నాహాలు

గోవిందరావుపేట, జూలై 24 (ఆంధ్రజ్యోతి): ప్రకృతిలో ఒదిగిన అందాల లక్నవరం జలకళను సంతరించుకుంది. గత నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలతో సరస్సులోకి భారీగా వరదనీరు వచ్చి చేరుతోంది. సరస్సు నీటి సామర్థ్యం 33 అడుగులు(ఫీట్లు) కాగా, ప్రస్తుతం నీటిమట్టం 25 అడుగులకు చేరింది. మొన్నటి వరకు నీటిమట్టం 15 అడుగులు ఉండగా, నాలుగు రోజుల్లో కురిసిన వర్షాలతో ఏకంగా 10 అడుగులు పెరిగింది. మరో 8 అడుగులు పెరిగితే సరస్సు పూర్తిగా నిండి మత్తడి దూకుతుంది. సరస్సు జలకళను సంతరించుకోవడంతో పర్యాటకుల చూపు సరస్సు వైపు మళ్లింది. మొన్నటి వరకు సరస్సులో నీళ్లు లేకపోవడంతో బోటింగ్‌ను నిలిపివేశారు. ఇప్పుడు వరద నీరు చేరడంతో బోటింగ్ ప్రారంభానికి సన్నాహాలు చేస్తున్నారు. గోవిందరావుపేట మండలంలోని బుస్సాపూర్ గ్రామ సమీపంలో ఈ సరస్సు ఉంది. అదేవిధంగా మండలంలోని గుండ్లవాగు ప్రాజెక్టు నీటిమట్టం 24.5 అడుగులకు చేరుకుంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి సామర్థ్యం 25 అడుగులు కాగా, మరో అర అడుగు నీరు చేరితే మత్తడి పడనుంది.



కాంబోడియాలో సైబర్ మోసాలు..

105 మంది భారతీయుల అరెస్టు

- 138 ప్రాంతాల్లో కాంబోడియా పోలీసుల దాడులు
- 3,075 మంది అనుమానితుల పట్టివేత

న్యూఢిల్లీ, జూలై 24: కాంబోడియా కేంద్రంగా చైనా సైబర్ నేరగాళ్లు నిర్వహిస్తున్న కాల్ సెంటర్లపై అక్కడి పోలీసులు దాడులు జరిపారు. 15 రోజుల పాటు.. 138 ప్రాంతాల్లో జరిపిన ఈ దాడుల్లో మొత్తం 3,075 మంది అనుమానితులను అరెస్టు చేశారు. వీరిలో 105 మంది భారతీయులున్నారు. నిజానికి భారతీయులను ఉద్యోగాల పేరుతో కాంబోడియా, మయన్మార్ వంటి దేశాలకు తీసుకెళ్తున్న చైనా సైబర్ కేటుగాళ్లు.. వారిని అక్కడ నిర్బంధిస్తున్నారు. బలవంతంగా సైబర్ నేరాల కాల్ సెంటర్లు నిర్వహించేలా చేస్తున్నారు. మాట వినకుంటే.. కరెంటు షాకులివ్వడం, తిండితిప్పలు లేకుండా చేస్తూ.. హింసిస్తున్నారు. దీనిపై భారత ప్రభుత్వం పలు దఫాలుగా కాంబోడియా ప్రభుత్వంతో చర్చించింది. ఈ క్రమంలో కాంబోడియా పోలీసులు ఈ దాడులు జరిపారు. అరెస్టయిన వారిలో భారతీయులతోపాటు.. వివిధ దేశాల పౌరులు ఉన్నారు. కాగా.. ఈ దాడుల్లో అరెస్టయిన 105 మంది భారతీయులను వెనక్కి రప్పించేందుకు కేంద్ర హోంశాఖ చర్యలను ప్రారంభించినట్లు తెలుస్తోంది.

అమెరికాలో భారీగా పడిపోయిన జననాల రేటు

న్యూయార్క్, జూలై 24: అమెరికాలో సంతానోత్పత్తి దారుణంగా పడిపోతోంది. గతంలో ఎప్పుడూ లేనంత తక్కువగా గత ఏడాది జననాల రేటు నమోదైంది. 2024కు సంబంధించి వ్యాధి నియంత్రణ, నివారణ సెంటర్లు (సీడీసీ) తాజాగా విడుదల చేసిన గణాంకాల్లో సంతానోత్పత్తి తగ్గిపోయిన విషయం స్పష్టమైంది. జనాభా భర్తీ రేటు ప్రకారం సగటున ప్రతి మహిళకు 2.1 కంటే ఎక్కువగా పిల్లలు ఉండాల్సిన తరుణంలో.. అమెరికాలో జననాల రేటు 1.6 కంటే తక్కువగా నమోదైందని సీడీసీ వెల్లడించింది. 1960ల్లో యూఎస్‌లో జననాల రేటు సుమారు 3.5గా ఉంది. ఆ తర్వాత నుంచి క్రమంగా క్షీణిస్తూ వస్తోంది. జననాల రేటు తగ్గిపోతోందన్న హెచ్చరికల నేపథ్యంలో ట్రంప్ ప్రభుత్వం సంతానోత్పత్తిని పెంచడానికి ఇటీవల చర్యలు చేపట్టింది.

గర్భిణి అనుమానాస్పద మృతి

- భార్య మృతదేహంతో 3 రోజులు ఇంట్లోనే భర్త
- స్థానికులు గమనించడంతో పరారీ

బెంగళూరు, జూలై 24(ఆంధ్రజ్యోతి): బెంగళూరు నగర పరిధిలోని హెణ్ణూరు థణిసంద్రలో ఓ గర్భిణి అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. ఆమె మృతదేహంతో భర్త ఇంట్లోనే మూడు రోజులపాటు గడిపాడు. ఆ ఇంట్లోంచి దుర్వాసన రావడంతో స్థానికులు గమనించారు. దీంతో బుధవారం ఈ విషయం వెలుగులోకి వచ్చింది. ఉత్తరప్రదేశ్‌కు చెందిన శివం, ఆయన భార్య సుమన్ ఆ ఇంట్లో నివసించేవారు. శివం పెయింటింగ్ పనులు చేసేవాడు. మూడురోజుల కిందట సుమన(22) అనుమానాస్పదంగా మృతి చెందింది. ఆ రోజు శివం పనుల కోసం బయటకు వెళ్లాడు. భార్య మృతిచెందాక పనులకు వెళ్లాడా, ఆయన వెళ్లాక ఆమె మృతిచెందిందా అన్నది స్పష్టత లేదు. కానీ ఆ మరుసటి రోజు భార్య మృతదేహం వద్దే శివం గడిపినట్లు, అక్కడే మద్యం సేవించి, భోజనం చేసిన అనవాళ్లు ఉన్నాయి. మూడో రోజు బుధవారం ఇంటి నుంచి దుర్వాసన రావడం మొదలైంది. దీంతో స్థానికులు ఆ రోజు మధ్యాహ్నం ఇంట్లోకి వెళ్లగా.. శివం ఒక్కసారిగా అక్కడి నుంచి పారిపోయాడు. వెంటనే వారు హెణ్ణూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు సుమన మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని, శివం కోసం గాలిస్తున్నారు. సుమన మృతికి కారణాలను పోలీసులు అన్వేషిస్తున్నారు.

అనిల్ అంబానీ సంస్థలపై ఈడీ దాడులు

న్యూఢిల్లీ, జూలై 24: మూడువేల కోట్ల రూపాయల బ్యాంకు రుణ మోసం, నగదు అక్రమ చలామణీ కేసు దర్యాప్తులో భాగంగా.. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు ప్రముఖ పారిశ్రామికవేత్త అనిల్ అంబానీ కంపెనీలు, ఎస్ బ్యాంకుకు చెందిన 35 కార్యాలయాలపై దాడులు చేశారు. నగదు అక్రమ చలామణీ నిరోధక చట్టం కింద 25 మందిని ప్రశ్నించారు. ఆయా కార్యాలయాల నుంచి పలు పత్రాలు, కంప్యూటర్ ఉపకరణాలను (ఎక్స్‌టర్నల్ హార్డ్ డిస్కులు, పెన్‌డ్రైవ్‌ల వంటివి) స్వాధీనం చేసుకున్నారు. 2017-2019 మధ్య 'ఎస్ బ్యాంకు' అధికారులకు రిలయన్స్ గ్రూపు కంపెనీలు లంచాలు ఇచ్చి.. ఆ బ్యాంకు నుంచి రూ.3000 కోట్ల మేర రుణాలు పొంది, ఆ రుణాలను అక్రమంగా దారి మళ్లించాయన్న ఆరోపణలపై ఈడీ దర్యాప్తు చేస్తోంది. ఆ రుణాల మంజూరుకు ఎస్‌బ్యాంకు వర్గాలు పలు నిబంధనలను ఉల్లంఘించాయని.. పాత తేదీతో రూపొందించిన రుణ మంజూరు గుర్తింపు పత్రాలను ఉపయోగించాయని.. మంజూరైన రుణాలను రిలయన్స్ గ్రూప్‌లోని పలు ఇతర సంస్థలకు, షెల్ కంపెనీలకు మళ్లించారని ఆరోపణలు రావడంతో.. ఈ వ్యవహారంపై కేంద్ర దర్యాప్తు సంస్థ(సీబీఐ) 2022 సెప్టెంబరులో రెండు కేసులు నమోదు చేసింది. ఈ రెండు కేసుల్లోనూ ఎస్ బ్యాంకు సహ వ్యవస్థాపకుడు, ఆ బ్యాంకు మాజీ ఎండీ రాణా కపూర్ పేరును సీబీఐ ప్రస్తావించింది. సీబీఐ పెట్టిన రెండు కేసులతోపాటు.. ఈ వ్యవహారానికి సంబంధించి నేషనల్ హౌసింగ్ బ్యాంక్, సెబీ, నేషనల్ ఫైనాన్షియల్ రిపోర్టింగ్ అథారిటీ, బ్యాంక్ ఆఫ్ బరోడా ఇచ్చిన నివేదికల ఆధారంగా ఈడీ రంగంలోకి దిగింది. బ్యాంకులను, షేర్‌హోల్డర్స్‌ను, ఇన్వెస్టర్లను, ఇతర ప్రభుత్వ సంస్థలను మోసం చేసి ప్రజాధనాన్ని దారి మళ్లించడానికి పక్కా ప్రణాళికతో ఈ ఫ్రాడ్‌కు రూపకల్పన చేసినట్టు ఆయా సంస్థలు ఇచ్చిన నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. అప్పట్లో రిలయన్స్ గ్రూప్ కంపెనీలకు రుణం మంజూరు కావడానికి ముందే.. ఎస్ బ్యాంకు ప్రమోటర్లు 'నగదు (లంచం)' అందుకున్నట్టుగా ఈడీ తన ప్రాథమిక దర్యాప్తులో గుర్తించిందని విశ్వసనీయవర్గాల సమాచారం. ఎస్‌బ్యాంకు వద్దే కాదు.. కెనరా బ్యాంకు వద్ద సైతం ఆర్‌కామ్ ఇదే తరహాలో లంచాలిచ్చి రూ.1050 కోట్లకు పైగా రుణాలను పొందిన వైనంపైనా ఈడీ దృష్టి పెట్టినట్టు సమాచారం. రిలయన్స్ మ్యూచువల్ ఫండ్ సంస్థ బ్యాంకులు జారీ చేసే ఏటీ-1 (అడిషనల్ టైర్-1) బాండ్లలో రూ.2850 కోట్ల దాకా పెట్టుబడి పెట్టిందని.. అందుకు బదులుగా ఆయా బ్యాంకులు రుణాలు మంజూరు చేశాయని ('క్విడ్ ప్రో కో'గా) ఈడీ భావిస్తున్నట్టు విశ్వసనీయవర్గాల సమాచారం. కాగా.. ఈడీ సోదాలతో తమ వ్యాపార కార్యకలాపాలపై ఎలాంటి ప్రభావమూ పడలేదని రిలయన్స్ పవర్, రిలయన్స్ ఇన్‌ఫ్రా కంపెనీలు వేర్వేరు ప్రకటనలు చేశాయి. ఈడీ సోదాలకు సంబంధించి మీడియా కథనాల్లో పేర్కొంటున్న ఆరోపణలు రిలయన్స్ కమ్యూనికేషన్స్ లిమిటెడ్ (ఆర్‌కామ్) లేదా రిలయన్స్ హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్ (ఆర్‌హెచ్‌ఎఫ్ఎల్) పదేళ్ల క్రితం జరిపిన లావాదేవీలకు సంబంధించినవని వెల్లడించాయి.

ఇదేం తీర్పు?

- నటుడు దర్శన్‌కు కర్ణాటక హైకోర్టు బెయిల్‌పై సుప్రీంకోర్టు ఆగ్రహం



బెంగళూరు, జూలై 24 (ఆంధ్రజ్యోతి): చిత్రదుర్గ రేణుకాస్వామి హత్య కేసులో కన్నడ నటుడు దర్శన్, ఇతర నిందితులకు బెయిల్ మంజూరుచేసిన హైకోర్టుపై సుప్రీంకోర్టు ఆగ్రహించింది. 'వివేకాన్ని వాడే హైకోర్టు ఈ ఆదేశాలు ఇచ్చిందా.?' అని ఘాటుగా ప్రశ్నించింది. న్యాయ విచక్షణాధికారం తీవ్రంగా దుర్వినియోగం అయిందని వ్యాఖ్యానించింది. బెయిల్ ఆదేశాలను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌పై నిర్ణయాన్ని సుప్రీంకోర్టు రిజర్వులో ఉంచింది. 'ఇలాంటి కేసుల్లో బెయిల్ ఇవ్వవచ్చా? హైకోర్టు చేసిన తప్పునే మేం కూడా చేయదలుచుకోలేదు. బెయిల్ తీర్పును ఇచ్చేముందు విచక్షణాధికారాన్ని కోర్టు ఉపయోగించిందో లేదో పరిశీలించాలని అనుకుంటున్నాం. అందువల్ల పిటిషన్‌పై తొందరపడి తీర్పు ఇవ్వడంగానీ, విడుదలకు లేక శిక్షలకు ఆదేశాలు ఇవ్వడంగానీ చేయబోం" అని న్యాయమూర్తులు జస్టిస్ జేబీ పర్దీవాలా, జస్టిస్ ఆర్ మహదేవన్‌తో కూడిన ద్విసభ్య ధర్మాసనం స్పష్టం చేసింది. విచారణ సందర్భంగా.. దర్శన్, ఇతర నిందితులకు బెయిల్ ఇచ్చిన తీరును బెంచ్ తప్పుబట్టింది. "ప్రతి బెయిల్ తీర్పును హైకోర్టు ఇలాగే రాస్తుందా? ఈ కేసును హైకోర్టు చూసిన దృష్టి ఎక్కువగా మమ్మల్ని ఇబ్బంది పెట్టింది. సెషన్స్ కోర్టు జడ్జి అయితే అర్థం చేసుకోవచ్చు. కానీ, హైకోర్టు న్యాయమూర్తి ఇలాంటి పొరపాటు చేయడమేంటి? ఇంతేనా జడ్జి అవగాహన?. ఇది కుట్ర, హత్యలకు సంబంధించిన కేసు కావడంతో మా స్వరం కొంచెం కటువుగానే ఉంటుంది." అని బెంచ్ తెలిపింది. రేణుకాస్వామి హత్య కేసులో నటుడు దర్శన్, నటి పవిత్రాగౌడ, ఇతర నిందితులకు గత ఏడాది డిసెంబరు 13న కర్ణాటక హైకోర్టు బెయిల్ ఇచ్చింది. దీనిపై కర్ణాటక ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. విచారణ సందర్భంగా ఈ కేసులో పవిత్ర పాత్రపై సుప్రీంకోర్టు సీరియస్ అయింది. "అంతా మీవల్లే జరిగింది. మీరు అక్కడ లేకపోతే ఏ2 పట్టించుకునేవారుకాదు. ఏ2 స్పందించకపోతే మిగతావారూ పట్టించుకునేవారు కాదు. మొత్తం సమస్యకు మీరే కారణం." అంటూ ఆగ్రహించింది. దీనిపై పవిత్ర తరఫు న్యాయవాది స్పందిస్తూ.. "ఆమెకు (రేణుకాస్వామి నుంచి) అభ్యంతరకర మెజేస్‌లు వచ్చేవి. నేరుగా మాట్లాడిన కాల్ రికార్డులు లేవు. అపహరణ, హత్యతో ఆమెకు సంబంధం ఉన్నట్టు ఆధారాలు లేవు" అని వాదించారు. అయితే, తాము వాదనల లోతుల్లోకి వెళ్లదలుచుకోలేదని బెంచ్ స్పష్టం చేసింది. గార్డులు కిరణ్, పునీత్‌ల వాంగ్మూలాలను హైకోర్టు ఎందుకు తిరస్కరించిందని బెంచ్ నిలదీసింది. కర్ణాటక ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా వాదనలు వినిపించారు. కాల్ డేటా రికార్డులు, లొకేషన్ పిన్‌లు, దుస్తులపై, వాహనంలో దొరికిన డీఎన్ఏ, ఇతర ఆధారాలు వారిద్దరి వాంగ్మూలాలను ధ్రువీకరించాయని వాదించారు. సాక్ష్యాధారాల తీరుపై బెంచ్ పలు ప్రశ్నలు సంధించింది. "నిందితుల నుంచి మీరు మొబైల్ ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. దాడి దృశ్యాలను దానిలో ఎలా బంధించారు?." అని ప్రశ్నించింది. దీనికి లూథ్రా బదులిస్తూ.. దాడి ఫొటోలు ఏ2కు ఫార్వర్డ్ అయ్యాయని, తనను కొట్టవద్దు అని హతుడు వేడుకొంటుండగా తీసిన ఫొటో కూడా అందులో ఉన్నదని తెలపగా, బెంచ్ విస్మయానికి గురయింది. "ఒకవైపు కొడుతున్నారు.. మరోవైపు ఫొటోకు పోజు ఇస్తున్నారు.. నిజంగా నమ్మలేకపోతున్నాం." అని వ్యాఖ్యానించింది. వారు తమ అభిమాన నటుడి కోసం ఏమైనా చేయడానికి సిద్ధంగా ఉండే దర్శన్ అభిమాన సంఘానికి చెందినవారని లూథ్రా వివరించారు. "ఇదో కిరాతక హత్య. సోషల్ మీడియాలో పోస్టు చేశారనే కారణంగా రేణుకాస్వామిని కిడ్నాప్ చేసి కిరాతకంగా హతమార్చారు. నిందితులు దర్శన్, పవిత్రగౌడ సహా అందరి కండిషన్ బెయిల్‌ను రద్దు చేయాలి" అని ఆయన కోరారు. కాగా, దర్శన్ తరఫు న్యాయవాది కపిల్‌సిబల్ మరో కేసును వాదించేందుకు వెళ్లడంతో లిఖితపూర్వక వాదనల కోసం వారంరోజుల గడువు ఇస్తున్నామని బెంచ్ తెలిపింది. దీంతో బెయిల్ రద్దు కావచ్చునని నిందితులలో భయం పట్టుకుంది. నిందితులకు వ్యతిరేకంగానే తీర్పు ఉంటుందనే అభిప్రాయం వ్యక్తమౌతోంది. 'డెవిల్' సినిమా షూటింగ్ కోసం నటుడు దర్శన్ థాయ్‌లాండ్‌కు వెళ్లిన విషయం తెలిసిందే.

నకిలీ ఓట్లను అనుమతించేదే లేదు

- ఓటర్ల తొలగింపు అబద్ధం: సీఈసీ
- బిహార్‌లో ప్రత్యేక సవరణకు సమర్థన

న్యూఢిల్లీ, జూలై 24: బిహార్లో ఓటర్ల జాబితాల ప్రత్యేక విస్తృత సవరణ(ఎస్ఐఆర్)ను ఎన్నికల ప్రధాన కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్‌కుమార్ గట్టిగా సమర్థించుకున్నారు. నకిలీ ఓటర్లు ఓటేయడానికి అనుమతించే ప్రసక్తే లేదన్నారు. రాష్ట్రంలో అసలైన ఓటర్లను తీసివేస్తున్నామన్న విపక్షాల ఆరోపణలను ఖండించారు. ఈ ప్రక్రియను దేశవ్యాప్తంగా అమలు చేయబోతున్నట్లు ఆయన తాజాగా ప్రకటించారు. అయితే కర్ణాటకలో ఓటర్ల జాబితాలో అవకతవకలు జరిగాయని.. నూరు శాతం రుజువులున్నాయని.. ఒక నియోజకవర్గంలో వందలు, వేల అదనపు ఓటర్లను చేర్చారని లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ ఆరోపించారు. అయితే నిరాధార ఆరోపణలు చేయొద్దని, రాజ్యాంగ సంస్థను బెదిరిస్తున్నారని ఈసీ ఆక్షేపించింది. కాగా, బిహార్లో ప్రత్యేక సవరణను నిరసిస్తూ ఇండియా కూటమి ఎంపీలు గురువారం పార్లమెంటు ద్వారం వద్ద వరుసగా నాలుగో రోజూ ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా రాహుల్ ఈసీపై విరుచుకుపడ్డారు. కర్ణాటకలో ఓ లోక్‌సభ నియోజకవర్గంలో ఓటర్ల జాబితాలో అక్రమాలు జరిగాయని ఆరోపించారు. దీనిపై 90 శాతం కాదు.. నూరు శాతం రుజువులు చూపిస్తామని తెలిపారు. అయితే.. రాహుల్ చేసిన ఆరోపణలను ఈసీ తీవ్రంగా ఖండించింది. నిరాధార ఆరోపణలు చేయడమే గాక.. రాజ్యాంగబద్ధ సంస్థ అయిన ఎన్నికల కమిషన్‌ను ఆయన బెదిరిస్తున్నారని విమర్శించింది.

జడ్జిల నియామకంలో జాప్యంపై విచారణ

- రెండు వారాల తర్వాత చేపట్టనున్న సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ, జూలై 24: జడ్జిల నియామకంపై కొలీజియం చేస్తున్న సిఫార్సులను ఆమోదించకుండా కేంద్ర ప్రభుత్వం జాప్యం చేస్తుండడాన్ని ప్రశ్నిస్తూ దాఖలైన వ్యాజ్యాలపై విచారణ జరిపేందుకు గురువారం సుప్రీంకోర్టు అంగీకారం తెలిపింది. రెండు వారాల తరువాత విచారణ చేపడుతామని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్.గవాయ్, జస్టిస్ కె.వినోద్ చంద్రన్‌ల ధర్మాసనం పేర్కొంది. ఈ పిటిషన్లను 2023లోనే లిస్టు చేశారని, అనంతరం ఆకస్మికంగా వాటిని జాబితా నుంచి తొలగించారని సీనియర్ న్యాయవాది అరవింద్ దాతర్, న్యాయవాది ప్రశాంత్ భూషణ్ ధర్మాసనం దృష్టికి తెచ్చారు.

నిరాధార వార్తలు రాస్తే సహించేది లేదు



సమావేశంలో మాట్లాడుతున్న తెలంగాణ తహసీల్దార్ల అసోసియేషన్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ విక్రమ్‌కుమార్

- తప్పు చేస్తే కలెక్టర్‌కు ఫిర్యాదు చేయండి
- తహసీల్దార్ల సంఘం రాష్ట్ర నేత విక్రమ్‌కుమార్

పోచమ్మమైదాన్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ శాఖలో పనిచేసే అధికారులు, సిబ్బందిపై నిరాధారంగా తప్పుడు వార్తలు ప్రచురిస్తే సహించేది లేదని, బ్లాక్‌మెయిల్‌కు పాల్పడే వారిపై చట్టరీత్యా ఫిర్యాదు చేస్తామని తెలంగాణ తహసీల్దార్స్ అసోసియేషన్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ, ఐనవోలు తహసీల్దార్ విక్రమ్‌కుమార్ హెచ్చరించారు. వరంగల్‌లోని ఐఎంఏ హాల్‌లో గురువారం ఉమ్మడి జిల్లాలోని పలువురు తహసీల్దార్లు విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇటీవల ఓ పీడీఎఫ్ పత్రిక నిర్వాహకులు తనపై తప్పుడు వార్తలు ప్రచురించి మానసిన వేదనకు గురి చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. తప్పుడు వార్తలు రాసి బ్లాక్ మెయిలింగ్‌కు పాల్పడినందునే పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు వెల్లడించారు. అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు, వరంగల్ తహసీల్దార్ మహ్మద్ ఇక్బాల్ మాట్లాడుతూ.. రెవెన్యూ శాఖలో ఎలాంటి అవినీతి జరిగినా అధికారులకు ఫిర్యాదు చేయాలని అన్నారు. ఎవరైనా దళారులుగా వ్యవహరిస్తూ ప్రజల వద్ద డబ్బులు వసూలు చేస్తే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. అధికారులు, తహసీల్దార్లు తప్పు చేస్తే నేరుగా జిల్లా కలెక్టర్లకు ఫిర్యాదు చేయాలని అన్నారు. తప్పుడు వార్తలు రాసి అధికారులను బద్నాం చేస్తే పోలీసులకు ఫిర్యాదు చేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో తెలంగాణ తహసీల్దార్స్ అసోసియేషన్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు బండి నాగేశ్వర్‌రావు, రాయపర్తి తహసీల్దార్ శ్రీనివాస్, హసన్‌పర్తి తహసీల్దార్ ప్రసాద్, డిప్యూటీ తహసీల్దార్లు రంజిత్, నాగేంద్రప్రసాద్, సుమన్, రెవెన్యూ అధికారులు దినకర్, కృష్ణస్వామి, అవినాశ్, కీర్తన్, రమ్య తదితరులు పాల్గొన్నారు.



మేడిగడ్డ బ్యారేజీ వద్ద సీడబ్ల్యూపీఆర్ఎస్ నిపుణులతో ఇరిగేషన్ అధికారులు

మేడిగడ్డ బ్యారేజీ వద్ద

మరోమారు పరీక్షలు

ఎన్‌డీఎస్ఏ నివేదిక ప్రకారం పరిశీలన

మహదేవపూర్ రూరల్, జూలై 24 (ఆంధ్రజ్యోతి) : కాళేశ్వరం ప్రాజెక్టులో ప్రధానమైన మేడిగడ్డ బ్యారేజీ వద్ద మరోమారు పరీక్షలు నిర్వహించేందుకు సన్నద్ధమవుతున్నారు. అందుకోసం ఇంజనీరింగ్ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. పూణెకు చెందిన సెంట్రల్ వాటర్ అండ్ పవర్ రీసెర్చ్ స్టేషన్ (సీడబ్ల్యూపీఆర్ఎస్) నిపుణులు ఈ పరీక్షలను చేపట్టనున్నారు.

టీమ్ లీడర్ శరబ్‌జిత్ సింగ్ ఆధ్వర్యంలోని నలుగురు సభ్యులు గురువారం మేడిగడ్డ బ్యారేజీని పరిశీలించారు. నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్ఏ) ఇటీవల తుది నివేదికను విడుదల చేసింది. అందులో పేర్కొన్న టెస్టులను నిర్వహించేందుకు ఈ బృందం మేడిగడ్డ బ్యారేజీని పరిశీలించినట్లు ఇరిగేషన్ అధికారులు తెలిపారు.

అన్నారం, సుందిళ్లలోనూ టెస్టులు

ఎన్‌డీఎస్ఏ సూచించిన విధంగా కాళేశ్వరం ప్రాజెక్టు లింక్-1లో ఉన్న మేడిగడ్డ బ్యారేజీ సహా అన్నారం, సుందిళ్ల బ్యారేజీల్లోనూ పరీక్షలు నిర్వహించనున్నారు. మేడిగడ్డ బ్యారేజీలో కుంగిన ఏడో బ్లాక్‌తో పాటు మిగతా వాటిలోనూ సీడబ్ల్యూపీఆర్ఎస్ నిపుణుల బృందం పరీక్షలు చేపట్టనుంది. నది గర్భంతో పాటు బ్యారేజీ ఎగువ, దిగువ ప్రవాహాల్లోనూ ఈ బృందం పరీక్షలు చేయనుంది. బ్యారేజీ ప్రాంతంలో సాయిల్ (మట్టి), కాంక్రీట్ టెస్టులతో పాటు వివిధ రకాల పరీక్షలను ఈ నిపుణుల బృందం నిర్వహించనుంది. ప్రస్తుతం మూడు బ్యారేజీల వద్ద వరద ప్రవాహం కొనసాగుతుంది. నీటితో సంబంధం లేకుండా టెస్టులను తొలుత నిర్వహించనున్నట్లు అధికారులు వెల్లడించారు.

నది గర్భంలో నిర్వహించే టెస్టులను అక్టోబరుకు ముందు, తర్వాత బ్యారేజీ పైభాగంలో నిర్వహించే కాంక్రీటు తదితర టెస్టులతో పాటు నమూనాలను పూణెలోని ల్యాబ్‌లోకి తీసుకెళ్లి పరీక్షించనున్నారు. మంగళవారం సుందిళ్ల, బుధవారం అన్నారం, గురువారం మేడిగడ్డ బ్యారేజీని పరిశీలించిన బృందం అదేరోజు సాయంత్రం తిరిగి పూణె బయల్దేరి వెళ్లిపోయారు. గురువారం మేడిగడ్డ బ్యారేజీకి వచ్చిన సీడబ్ల్యూపీఆర్ఎస్ బృందంతో ఈఈ తిరుపతిరావు, డీఈఈలు సురేష్, భీమ్‌రాజు, ఏఈఈలు, సిబ్బంది ఉన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్‌కు తాళం వేసిన రైతు

పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన బాధిత రైతులు



ట్రాన్స్‌ఫార్మర్‌కు తాళం వేసి ఉన్న దృశ్యం



న్యాయం చేయాలని కోరుతున్న బాధిత రైతులు

స్టేషన్‌ఘన్‌పూర్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్ మండలం నెమలిగొండలో ఇతర రైతులకు విద్యుత్ సరఫరా కాకుండా గ్రామానికి చెందిన రైతు పెద్దపూండ్ర రవీందర్‌రెడ్డి తన చేనులో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌కు గురువారం తాళం వేశాడు. దీంతో మిగతా రైతులు తమకు న్యాయం చేయాలంటూ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాధిత రైతులు మాట్లాడుతూ 50ఏళ్ల క్రితం ట్రాన్స్‌ఫార్మర్ మంజూరు కాగా, దానికి అనుసంధానంగా మరో ఆరు ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు జరిగిందన్నారు. తన స్థలంలో ట్రాన్స్‌ఫార్మర్‌ను తీసి వేయాలని పైపులను పగుల గొట్టడం, గడ్డె కింద మట్టిని తొలగించడంతో పాటు, ఇష్టం వచ్చినప్పుడల్లా ట్రాన్స్‌ఫార్మర్‌ను బంద్ చేస్తూ బావులు, బోర్లకు విద్యుత్ సరఫరా రాకుండా చేస్తున్నాడని ఆరోపించారు. కార్యక్రమంలో బాధిత రైతులు ఎల్లా రెడ్డి, సారల్ రెడ్డి, సంపత్‌రెడ్డి, రాజేష్, శ్రీనివాస్ రెడ్డి, వాసుదేవ రెడ్డి, అశోక్ రెడ్డి, రమేష్, శ్రావణ్ పాల్గొన్నారు.

కమ్యూనికేషన్ స్కిల్స్‌తో ఉజ్వల భవిష్యత్తు

రాష్ట్ర విద్యా కమిషన్ సభ్యులు

స్టేషన్‌ఘన్‌పూర్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): ప్రతీ విద్యార్థి ఇంగ్లిష్‌లో ధారాళంగా మాట్లాడడంతో పాటు కమ్యూనికేషన్ స్కిల్స్ పెంపొందించుకుంటేనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని తెలంగాణ విద్యా కమిషన్ సభ్యులు పీఎల్ విశ్వేశ్వర్‌రావు, డాక్టర్ చారగొండ వెంకటేష్ తెలిపారు. గురువారం జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్ మండలం ఛాగల్ ఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు. తరగతి గదులు, టీచర్ల డైరీ, పాఠ్య ప్రణాళిక, ఉపాధ్యాయుల హాజరు రిజిస్టర్లు పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి మధ్యాహ్న భోజనం సక్రమంగా అందిస్తున్నరా ? పరిశుభ్రత పాటిస్తున్నరా ? అని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో టీచర్లు కె. ప్రకాశం, చిదురాల వేణు పాల్గొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న విద్యా కమిషన్ సభ్యులు

తెలంగాణ పార్లమెంటరీ బృందంలో ఎంపీ కావ్య

బీసీ రిజర్వేషన్ బిల్లుకు మద్దతు కూడగట్టే యత్నం



ఖర్గే, రాహుల్‌ను కలిసిన తెలంగాణ పార్లమెంటరీ బృందంలో ఎంపీ కావ్య

హనుమకొండ, జూలై 24 (ఆంధ్రజ్యోతి): బీసీ రిజర్వేషన్ బిల్లుకు మద్దతు కోసం ఢిల్లీలో ప్రయత్నాలు జరుపుతున్న తెలంగాణ పార్లమెంటరీ బృందంలో వరంగల్ ఎంపీ కడియం కావ్య ఉన్నారు. బిల్లుకు దేశవ్యాప్తంగా మద్దతును సమీకరించేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఢిల్లీలో విస్తృతస్థాయిలో సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో ఇండియా కూటమి మిత్రపక్షాల ఎంపీల మద్దతును పొందేందుకు ఏర్పాటుచేసిన పవర్ పాయింట్ ప్రజంటేషన్‌కు ముందు కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గేను పార్లమెంటరీ పక్షనేత రాహుల్ గాంధీని, రేవంత్‌రెడ్డి, భట్టి విక్రమార్క నేతృత్వంలో తెలంగాణ ఎంపీల బృందంలో ఒకరుగా కావ్య మర్యాదపూర్వకంగా కలిశారు. బీసీలకు న్యాయం చేయడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఈ బిల్లుపై పార్లమెంట్‌లో సహకరించాలని వారు నేతలను కోరారు.

నాగర్‌కర్నూల్ కలెక్టర్‌కు మాతృ వియోగం

- అనారోగ్యంతో చికిత్స పొందుతూ మృతి
- జనగామ జిల్లా సూరారంలో అంత్యక్రియలు



సంతోష్‌నాయక్‌ను పరామర్శిస్తున్న రిజ్వాన్ బాషా

జఫర్‌గఢ్, జూలై 24 (ఆంధ్రజ్యోతి) : నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్‌నాయక్‌కు మాతృ వియోగం కలిగింది. సంతోష్‌నాయక్ తల్లిదండ్రులు హరిలాల్-శాంతమ్మ జనగామ జిల్లా జఫర్‌గఢ్ మండలం సూరారంలో వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. బుధవారం రాత్రి శాంతమ్మ (58)కు ఛాతీలో నొప్పి వచ్చింది. చికిత్స కోసం ఆమెను వెంటనే హనుమకొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.



శాంతమ్మ (ఫైల్)

చికిత్స పొందుతూ ఆమె గురువారం తెల్లవారు జామున మృతి చెందినట్లు కుటుంబీకులు తెలిపారు. హరిలాల్ - శాంతమ్మకు ముగ్గురు కుమారులు ఉన్నారు. పెద్ద కుమారుడైన సంతోష్‌కుమార్ నాగర్‌కర్నూల్ కలెక్టర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. మధ్యాహ్నం సూరారంలో అంత్యక్రియలు నిర్వహించారు.


నివాళులర్పించిన కలెక్టర్, మాజీ ఎమ్మెల్యేలు

జనగామ కలెక్టర్ రిజ్వాన్ బాషా, ఆర్డీవో వెంకన్ననాయక్ శాంతమ్మ మృతదేహం వద్ద నివాళులర్పించి సంతోష్‌నాయక్‌ను పరామర్శించారు. అలాగే మాజీ ఎమ్మెల్యేలు అరూరి రమేశ్, తాటికొండ రాజయ్య, పలువురు అధికారులు, నాయకులు, గ్రామస్థులు శాంతమ్మ మృతదేహం వద్ద నివాళులర్పించారు.

వికసించిన బ్రహ్మ కమలం

జనగామ కల్చరల్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): హిమాలయాల్లో మాత్రమే కనిపించే బ్రహ్మకమలం పుష్పం జనగామలో వికసించింది. జిల్లా కేంద్రంలోని గుండ్లగడ్డ కాలనీలో రామగిరి శ్రీనివాసులు- రమాదేవి దంపతుల ఇంటిలో గురువారం పుష్పం కనిపించింది. లక్ష్మీదేవి, సరస్వతి దేవికి నివాసంగా భావించే బ్రహ్మకమలం మొక్కను ఇంట్లో పెంచడం అదృష్టంగా భావిస్తారు. హిందూ పురాణాల ప్రకారం ఈ పువ్వు సృష్టికర్త బ్రహ్మదేవుడితో సంబంధం కలిగి ఉంది. రాత్రి సమయంలో మాత్రమే పూసే ఈ పువ్వును ఉమామహేశ్వరస్వామి ఆలయంలో స్వామి వారికి మాలగా వేసి పూజలు చేశారు.





ఎల్లో అలర్ట్



దొడ్ల వద్ద గల జంపన్నవాగుపై నడుస్తున్న పడవ

ములుగు, జూలై 24(ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లాలో ఎడతెరిపిలేన వర్షం కురిసింది. దీంతో అధికారులు ఎల్లో అలర్ట్ ప్రకటించారు. బుధవారం ఉదయం 8.30 గంట నుంచి గురువారం ఉదయం 8.30 గంటల వరకు జిల్లా వ్యాప్తంగా 81.64 సెంటీమీటర్ల వర్షం కురిసింది. జిల్లాలో సగటు వర్షపాతం 9.07 సెం.మీ వర్షపాతం నమోదైనట్టు వాతావరణ శాఖ వెల్లడించింది. అత్యధికంగా వెంకటా పురం మండలంలో 23.52 సెం.మీ వర్షపాతం నమోదు కాగా అత్యల్పంగా వెంకటాపూర్ మండలంలో 3.24 సెం.మీ కురిసింది. మంగపెట మండలంలో 14.00 సెం.మీ, ఏటూరునాగారం మండలంలో 11.42 సెం.మీ, వాజేడు మండలంలో 9.68 సెం.మీ, తాడ్వాయి మండలంలో 6.70 సెం.మీ, కన్నాయిగూడెం మండలంలో 3.56 సెం.మీ, ములుగు మండలంలో 3.50 సెం.మీ, వెంకటాపూర్ మండలంలో 3.24 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైనట్టు అధికారులు వెల్లడించారు. జిల్లాలో 9.07 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు పేర్కొన్నారు. గురువారం ఉదయం 8.30 గంటల నుంచి సాయంత్ర 5 గంటల వరకు ములుగు మండలంలో 0.83 సెం.మీ, వెంకటాపూర్ మండలంలో 0.38 సెం.మీ, వెంకటాపురం మండలంలో 0.02 సెం.మీ, వాజేడు మండలంలో 0.18 సెం.మీ, జేడీ మల్లంపల్లి మండలంలో 0.15 సెం.మీ, గోవిందరావుపేట మండలంలో 0.08 సెం.మీ, తాడ్వాయి మండలంలో 0.05 సెం.మీ వర్షపాతం నమోదైనట్టు వాతావరణ శాఖ తెలిపింది.

పెరిగిన గోదావరి

ములుగు జిల్లాలోని కన్నాయిగూడెం, వాజేడు, ఏటూరునాగారం, మంగపేట మండలాల్లోని గోదావరం గురువారం స్వల్పంగా పెరిగింది. మూడు రోజులుగా కురుస్తున్న వర్షాల ప్రభావంతో ఎగువ ప్రాంతాల నుంచి వరద నీరు గోదావరిలో చేరుతోంది. దీంతో ఉధృతి స్వల్పంగా పెరిగింది. వర్షాలు మరో రెండు రోజులు కురుస్తాయని వాతావరణ శాఖ చెబుతుండడంతో గోదావరికి వరద తాకిడి మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు అంటున్నారు. ముంపుప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు.

● మహదేవపూర్ (ఆంధ్రజ్యోతి) : మహదేవపూర్ మండలం కాళేశ్వరం త్రివేణి సంగమం వద్ద గోదావరి నీటి మట్టం పెరిగింది. గురువారం 7.30 మీటర్లకు చేరింది. ప్రాణహిత వరదతో పాటు తెలంగాణలో మూడు రోజులు నుంచి వరుసగా వర్షాలు కురుస్తుండటంతో వరద నీరు పెద్ద ఎత్తున చేరింది. గోదావరి ఇంకా పెరిగే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

మేడిగడ్డ బ్యారేజీకి కొనసాగుతున్న వరద

మహదేవపూర్ రూరల్ (ఆంధ్రజ్యోతి) : జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని మేడిగడ్డ బ్యారేజీకి వరద ప్రవాహం కొనసాగుతోంది. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో ప్రాణహిత నదితో పాటు గోదావరి నుంచి ఇన్‌ఫ్లో పెరుగుతూ వస్తోంది. గురువారం బ్యారేజీకి ఇన్‌ఫ్లో 2.30లక్షల క్యూసెక్కులుగా నమోదుకాగా గేట్లన్నీ ఓపెన్ చేసి వచ్చిన నీటిని వచ్చినట్లే దిగువకు పంపిస్తున్నారు. బ్యారేజీ వద్ద గోదావరి నది 3.60 మీటర్ల ఎత్తులో ప్రవహిస్తోంది.

సమ్మక్కసాగర్ గేట్లు ఎత్తివేత

కన్నాయిగూడెం (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలంలోని సమ్మక్క సాగర్ ప్రాజెక్ట్ 12 గేట్లను ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. ప్రాజెక్ట్ నీటి సామర్థ్యం 6.94 టీఎంసీలు కాగా 3.888 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ప్రాజెక్ట్ ఇన్‌ఫ్లో 1,73,140 క్యూసెక్‌లు కాగా 2,14,970 క్యూసెక్‌ల నీటిని విడుదల చేస్తున్నారు. మొత్తం 59 గేట్లకు 12 గేట్లు తెరిచి దిగువకు వదులుతున్నారు. వెంకటాపురం మండలంలోని పాలెం ప్రాజెక్ట్ సామర్థ్యం 1258.82 ఎంసీఎఫ్‌టీ కాగా ప్రస్తుతం 688.28 ఎంసీఎఫ్‌టీ నీరు ఉంది. ప్రస్తుతం 124.60 మీటర్ల నీటిమట్టం ఉంది. ఇన్‌ఫ్లో 5,322 క్యూసెక్‌లు కాగా ఔట్‌ఫ్లో 450 క్యూసెక్‌లు ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. మొత్తం నాలుగు గేటు ఉండగా అన్నింటినీ తెరిచి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు.

పాలెం ప్రాజెక్టు గేట్ల ఎత్తివేత

వెంకటాపురం (ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్లాపురం గ్రామ సమీపంలోని పాలెంవాగు ప్రాజెక్టు జలకళ సంతరించుకుంది. మండలంలో గత నాలుగురోజులుగా కురుస్తున్న వర్షాలకుతోడు ఎగువ ప్రాంతమైన చత్తీస్‌గఢ్ రాష్ట్రంలో కురుస్తున్న వర్షాలకు భారీగా వరదనీరు ప్రాజెక్టులోకి చేరుకుంది. సామర్థ్యానికి మించి వరద నీరు చేరడంతో అధికారులు ప్రాజెక్టుకు సంబంధించిన నాలుగుగేట్లను ఎత్తి దిగువకు నీటిని విడుదల చేశారు. ప్రాజెక్టు నీటి సామర్థ్యం 124.60మీటర్లు కాగా రిజర్వాయర్‌లోకి భారీగా వరదనీరు చేరింది. ప్రాజెక్టు ఇన్‌ఫ్లో 5,322క్యూసెక్కులు కాగా అవుట్‌ఫ్లో 450క్యూసెక్కులుగా ఉంది.

కాల్వకు బుంగ

భారీ వర్షాలతో పాలెంవాగు ప్రాజెక్టు పూర్తిగా నిండుకోవడంతో ప్రధాన కాల్వకు బుంగ పడింది. ప్రధాన కాల్వకు బొల్లారం గ్రామ సమీపంలో బుంగ పడి నీరు పంట పొలాల్లో ప్రవహించడంతో రైతులు తమ సొంత ఖర్చులతో జేసీబీ సహాయంతో ట్రాక్టర్‌లో మొరం తెప్పించి బుంగను పూడ్చుకున్నారు.

మల్లూరు ప్రాజెక్టుకు జలకళ

మంగపేట (ఆంధ్రజ్యోతి) : మల్లూరు వాగుపై నిర్మించిన మల్లూరు మధ్య తరహా ప్రాజెక్ట్‌కు జలకళ సంతరించుకుంది. మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు ఎగువ భాగంలో వాగులు, ఒర్రెలు, గుట్టల నుంచి వచ్చిన వరద నీరు ప్రాజెక్టులోకి చేరుకొంటోంది. గురువారం సాయంత్రం వరకు 113.60 మీటర్ల నీటిమట్టం నమోదైంది. మరో రెండు మీటర్ల వరకు వరద చేరితే ప్రాజెక్టు మత్తడి పడు తుందని ఇరిగేషన్ అధికారులు చెబుతున్నారు.

జంపన్నవాగుపై పడవల ఏర్పాటు

ఏటూరునాగారం రూరల్ (ఆంధ్రజ్యోతి) : ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలకు జంపన్నవాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో మండలంలోని మల్యాల, కొండాయి, ఐలాపురం, గోవిందరాజుల కాలనీలతో పాటు ఎలిశెట్టిపల్లి గ్రామాలకు పూర్తిగా జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. ఆయా గ్రామాలకు బాహ్య ప్రపంచంతో పూర్తిగా సంబంధాలు తెగిపోగా మంత్రి దనసరి సీతక్క ఆదేశాల మేర కు జిల్లా యంత్రాంగం జంపన్నవాగుపై గురువారం పడవలను ఏర్పాటు చేసింది. స్థానిక తహసీల్దార్ జగదీశ్వర్ ఉన్నతాధికారుల ఆదేశాలతో దొడ్ల వద్ద జంపన్నవాగుపై రెండు పడవలు, ఎలిశెట్టిపల్లి వద్ద గల జంపన్నవాగుపై మరొక పడవను సిద్ధం చేశారు. అంతేకాకుండా దొడ్ల, ఎలిశెట్టిపల్లి వద్ద ఎన్డీఆర్ఎఫ్ బృందంతో పాటు అగ్నిమాపక సిబ్బందిలు విధుల్లో ఉన్నారు.

ప్రజలు అధికారులకు సహకరించాలి : కలెక్టర్

రానున్న మూడు రోజులు జిల్లా వ్యాప్తంగా భారీ వర్షాలు కురిసే అవకాశముందని, ముంపు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉంటూ అధికారుల సూచనలు, సలహాలను పాటించాలని కలెక్టర్ టి.ఎస్ దివాకర అన్నారు. మండలంలోని దొడ్ల గ్రామంలో కలెక్టర్ పర్యటించారు. దొడ్ల వద్ద గల జంపన్నవాగు ఉధృతిని పరిశీలించి తహసీల్దార్ జగదీశ్వర్‌ను పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. జంపన్నవాగుపై ఏర్పాటు చేసిన పలు గ్రామాల ప్రజల సౌకర్యార్థం పడవను ఏర్పాటు చేయగా అధికారులకు కలెక్టర్ పలు సూచనలు చేశారు. రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు జంపన్నవాగుకు వరద ఉధృతి పెరగిందన్నారు. జంపన్నవాగుపై తాత్కాలికంగా ఏర్పాటు చేసిన రోడ్డు వరద తాకిడికి కొట్టుకుపోయిందని, ప్రజలు రాకపోకలు సాగించేందుకు పడవను ఏర్పాటు చేశామని అన్నారు. వర్షాకాలం దృష్ట్యా తక్షణ సహాయం కోసం కలెక్టరేట్‌లో 18004257109 టోల్ ఫ్రీ నంబర్‌ను సంప్రందించాలని, కంట్రోల్ రూం 24గంటలు అధికారులు అందుబాటులో ఉంటారని కలెక్టర్ తెలిపారు.

భూపాలపల్లి జిల్లాలో సగటు వర్షపాతం 5.01 సె.మీ

కృష్ణకాలనీ, జూలై 24 (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి జిల్లాలో మూడు రోజులుగా ముసురు వాన కురుస్తోంది. కాస్త విరామం ఇచ్చిన భారీ వర్షాలు చినుకులుగా కురుస్తున్నాయి. జిల్లా వ్యాప్తంగా 24 గంటల్లో 56.3 సెం.మీ వర్షం కురిసింది. జిల్లాలో సగటు వర్షపాతం 5.01 సెం.మీ నమోదైంది. మహదేవపూర్ మండలంలో 5.01 సెం.మీ, పలిమెల మండలంలో 4.0, మహాముత్తారం మండలంలో 3.6, కాటారంలో 4.3 మల్హర్‌లో 3.3, చిట్యాలలో 6.7, టేకుమట్లలో 5.6, మొగుళ్లపల్లిలో 8.6, రేగొండలో 6.5, గణపురంలో 2.8, భూపాలపల్లిలో 5.3, కొత్తపల్లిగోరి మండలంలో 1.2 సెం.మీ వర్షపాతం నమోదైంది.

కాళేశ్వరంలో జిల్లా జడ్జి పూజలు

మహదేవపూర్, జూలై 24(ఆంధ్రజ్యోతి) : మండలంలోని కాళేశ్వరాలయంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.హెచ్.రమేష్‌బాబు గురువారం ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా అర్చకులు జడ్జిని పూర్ణకుంభంతో స్వాగతించారు. ఆలయ మర్యాదలతో సన్మానించారు.

5 ఇన్‌క్లైన్ సందర్శన

కృష్ణకాలనీ (ఆంధ్రజ్యోతి): సింగరేణి ఏరియా పరిధిలోని 5 ఇన్‌క్లైన్ గనిని జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.హెచ్. రమేష్‌బాబు పరిశీలించారు. మేనేజర్, సేఫ్టీ అధికారుల పర్యవేక్షణలో అండర్ గ్రౌండ్‌లోకి దిగారు. మైనింగ్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. బొగ్గు గని కార్మికుల సంక్షేమం, రక్షణ కోసం సింగరేణి సంస్థ తీసుకుంటున్న చర్యలను అధికారులు జడ్జికి వివరించారు.



సింగరేణికి రూ. 9 కోట్లు నష్టం

కృష్ణకాలనీ, జూలై 24 (ఆంధ్రజ్యోతి):గత మూడు రోజులుగా కురుస్తున్న ముసురు వానల కారణంగా భూపాలపల్లి ఏరియాలో 4 భూగర్భ గణులు, 2 ఓసీల్లో బొగ్గు ఉత్పత్తికి అంతరాయం ఏర్పడుతోంది. ఫలితంగా నిర్దేశిత లక్ష్యంలో కేవలం 45 శాతం మాత్రమే బొగ్గును వెలికి తీస్తున్నారు. సాదారణ రోజుల్లో రోజుకు 10796 మెట్రిక్ టన్నుల బొగ్గు ఉత్పత్తి జరుగుతుండగా గడిచిన మూడు రోజులుగా రోజుకు కేవలం 4810 మెట్రిక్ టన్నులు మాత్రమే ఉత్పత్తి అవుతోంది. ఫలితంగా మూడు రోజుల వ్యవధిలో సింగరేణికి సుమారు రూ.9 కోట్ల మేరా సంస్థకు నష్టం వాటిల్లింది. అలాగే, తాడిచర్ల ఓసీపీలోనూ బొగ్గు తవ్వకాలకు తీవ్ర అంతరాయం ఏర్పడినట్లు తెలిసింది. అక్కడ కూడా మూడు రోజులుగా ఉత్పత్తి నిలిచిపోయింది.

తాడిచర్ల ఓసీలో..

మల్హర్ : గత మూడు రోజుల నుంచి ఎడతెరిపి లేకుండ కురుస్తు న్న వర్షం వల్ల తాడిచర్ల ఓసీపీలో బొగ్గు ఉత్పత్తికి అంతరాయం ఏర్పడింది. రోజు ఆరు వేల మెట్రిన్ టన్నుల బొగ్గు, లక్ష క్యూబిక్ మీటర్ల మట్టి వెలికితీత పనులు నిలిచిపోయాయి. వర్షం వల్ల మైన్‌లో వరద నీరు వచ్చి చేరండతో మోటార్ల సాయంతో నీటని బయటకు పంపుతున్నారు. మైన్ ఆవరణం మొత్తం బురదమయం కావడంతో వాహనాలు కదలేని పరిస్థితి ఉంది. మూడు రోజులు మైన్ నిలిచిపోవడం వల్ల 18 వేల మెట్రిక్ టన్నుల బొగ్గు ఉత్పత్తి నిలిచిపోయినట్లు మైన్ అధికారులు తెలుపుతున్నారు.

నేడు మందకృష్ణ మాదిగ రాక

కృష్ణకాలనీ, జూలై 24 (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి జిల్లా కేంద్రానికి ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ శుక్రవారం రానున్నారు. వృద్ధులు, వితంతువులు, వికలాంగులకు రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల హామీల్లో భాగంగా పెన్షన్ పెంచుతామని చెప్పిన నేపథ్యంలో ఆ హామీని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ వృద్ధులు, వితంతు వులు, వికలాంగులతో సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎమ్మార్పీఎస్, ఎంస్‌పీ జిల్లా కో-ఇన్‌చార్జి అంబాల చంద్రమౌళి తెలిపారు. ఉదయం 11 గంటలకు కార్యక్రమం ప్రారంభం అవుతుందని, అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

విద్యార్థినికి పుట్ట మధు చేయూత

కాటారం, జూలై 24(ఆంధ్రజ్యోతి):మండలకేంద్రంలోని గంటగూడెంలో పేదకుటుంబానికి చెందిన ఎంబీబీఎస్ విద్యార్థిని గంట జ్యోత్స్న చదువు కోసం బీఆర్ఎస్ మంథని నియోజకవర్గ ఇంచార్జి, మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు చేయూతనందిస్తానని తెలిపారు. గురువారం మాజీ మంత్రి కేటీఆర్ జన్మదినాన్ని పురస్కరించుకుని 'గిఫ్ట్ ఏ స్మైల్ 'లో భాగంగా కోర్సు పూర్తయ్యేదాకా చదువు కోసం కావాల్సిన ఏర్పాట్లు చూసుకుంటానని జ్యోత్స్న ఇంటికి వెళ్లి హామినిచ్చారు. ఈ సందర్భంగా మధు మాట్లాడుతూ పేద ప్రజల కళ్లల్లో ఆనందం చూడాలనే ఉద్దేశ్యంతో శ్రీకారం చుట్టిన గిఫ్ట్ ఏ స్మైల్‌లో భాగంగా నిరుపేద అయిన జ్యోత్స్న కుటుంబానికి అండగా ఉంటానని హామినిచ్చారు. ఈ ప్రాంతంలోని పేదల ఓట్లు 40ఏళ్లుగా వేయించుకుంటున్న నాయకులు వారి బాధలను తీర్చే ప్రయత్నం చేయడం లేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీ చైర్ పర్సన్ జక్కు శ్రీహర్షిణి, డివిజన్ బీఆర్ఎస్ నాయకులు జోడు శ్రీనివాస్, రాకేష్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

చిట్యాల, జూలై 24 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని ఉపాధ్యాయు సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు స్థానిక తహసీల్దార్ ఇమామ్ షేక్ బాబాకు గురువారం తహసీల్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. అన్ని క్యాడర్లకు బదిలీ, ప్రమోషన్లకు షెడ్యూల్ విడుదల చేయాలని, ప్రతీ ప్రభుత్వ పాఠశాలలో కనీసం ఇద్దరు ఉపాధ్యా యులను నియమించాలని, ఉద్యోగ, ఉపాధ్యాయుల పెండిగ్ బిల్లులను విడుదల చేయాలని, సీపీఎస్ విధ్యానాన్ని రద్దుచేసి పాత పెన్షన్ విదానాన్ని అమలు చేయాలని పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ బాధ్యులు పాముకుంట్ల తిరుపతయ్య, యోగానందచారి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కేటీఆర్ జన్మదిన వేడుకలు

కృష్ణకాలనీ, జూలై 24 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు గండ్ర జ్యోతి దంపతులు పాల్గొన్నారు. రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేయగా మాజీ ఎమ్మెల్యేతో సహా పలువురు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు రక్తదానం చేశారు. మునిసిపల్ మాజీ చైర్ పర్సన్ సెగ్గం వెంకటరాణి, బీఆర్ఎస్ నాయకులు కళ్లెపు రఘుపతిరావు, సెగ్గం సిద్ధు, జంగేడు పీఏసీఎస్ చైర్మన్ మేకల సంపత్ యాదవ్, జాగృతి జిల్లా అధ్యక్షుడు మాడ హరీష్‌రెడ్డి, పిల్లి వేణు, నూనే రాజు, మోతే రాజు, ముంజంపల్లి మురళీధర్ పాల్గొన్నారు.



భూపాలపల్లిలో కేటీఆర్ జన్మదిన వేడుకల్లో గండ్ర దంపతులు

● ములుగు టౌన్ (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ జన్మదిన వేడుకలు జిల్లా కేంద్రంలో ఘనంగా జరిగాయి. పార్టీ ములుగు నియోజకవర్గ ఇన్‌చార్జి బడే నాగజ్యోతి ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. పార్టీ మండల అధ్యక్షుడు సానికొమ్ము రమేష్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు పోరిక సోమ నాయక్, గోవింద నాయక్, చెన్న విజయ్, వేములపల్లి బిక్షపతి, గరిగే రఘు, గండి కుమార్, ఆదిరెడ్డి, దాసరి రమేష్, దుర్గం రమణయ్య పాల్గొన్నారు.



ములుగులో కేటీఆర్ జన్మదిన వేడుకల్లో బీఆర్ఎస్ నేతలు

● ఏటూరునాగారం (ఆంధ్రజ్యోతి): కేటీఆర్ జన్మదిన వేడుకలు బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మీనర్సింహరావు ఆదేశాల మేరకు మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలోని తెలంగాణ తల్లి విగ్రహం ఎదుట బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు గడదాసు సునీల్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు కాకులమర్రి ప్రదీప్‌రావు, సీనియర్ నాయకులు తుమ్మ మల్లారెడ్డి, నూతి కృష్ణమూర్తి, పీఏసీఎస్ చైర్మన్ కూనూరు అశోక్ గౌడ్, తాడూరి రఘు, గడేపల్లి నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

● కాటారం (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో కేటీఆర్ జన్మదిన వేడుకలను బీఆర్ఎస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. బీఆర్ఎస్ మండల ఇన్‌చార్జి జోడు శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి మాజీ జడ్పీ చైర్మన్లు పుట్ట మధు, జక్కు శ్రీహర్షిణి హాజరై కేక్ కట్ చేసి పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నేతలు జనార్ధన్, రాకేష్, కిరణ్, లక్ష్మారెడ్డి, వెంకటేశ్వర్‌రావు, సడువలి, సంతోష్, శ్రీనివాస్, శ్రావణ్, సడువలి, వెంకటస్వామి, శ్రీలక్ష్మి, శ్రీశైలం, రాజబాపు, అశోక్, రజనీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్ని'కల'లో..

(5వ పేజీ తరువాయి)

నంబర్లను సేకరిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ తరహా ప్రచారంలో అధికార పార్టీకి చెందిన నేతలు ముందు వరుసలో ఉండగా, అటు బీఆర్ఎస్ నేతలు కూడా ఇదే తరహా ఎత్తుగడను అనుసరిస్తున్నారని తెలుస్తోంది.

వ్యూహ ప్రతివ్యూహాలకు పదును

స్థానిక సంస్థల ఎన్నికల ముహూర్తం త్వరలో ఖరారు కానున్నట్లు వార్తలు వస్తున్న నేపథ్యంలో అధికార కాంగ్రెస్, ప్రధాన విపక్షమైన బీఆర్ఎస్ గ్రామాల్లో పట్టు సాధించేందుకు వ్యూహ ప్రతివ్యూహాలకు పదును పెడుతున్నాయి. ముఖ్యంగా ఇటీవలి రాజకీయ పరిణామాల నేపథ్యంలో పార్టీల గుర్తుపై జరగనున్న జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలు ఇరు పార్టీలకు ప్రతిష్ఠాత్మకంగా మారాయి. భూపాలపల్లి జిల్లాలోని మంథని, భూపాలపల్లి సెగ్మెంట్ల పరిధిలో మొత్తం 12 జడ్పీటీసీ స్థానాలు, 109 ఎంపీటీసీ స్థానాలు ఉన్నాయి. గతంలో 11 జడ్పీటీసీ స్థానాలు, 106 ఎంపీటీసీ స్థానాలు ఉండగా, ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం కొత్తపల్లిగోరి మండలాన్ని జడ్పీటీసీగా గుర్తించింది. అటు మంథని నియోజకవర్గంలోని పలిమెల మండలంలో కొత్తగా మూడు ఎంపీటీసీ స్థానాలను ఏర్పాటు అయ్యాయి. దీంతో జిల్లాలో కొత్తగా ఒక జడ్పీటీసీ, మూడు ఎంపీటీసీ స్థానాలు పెరిగాయి. ఈ నేపథ్యంలో ఈ రెండు నియోజకవర్గాల్లోని మెజారిటీ స్థానాల్లో పాగా వేయడం రెండు పార్టీలకు కీలకంగా మారింది. దీంతో మంత్రి శ్రీధర్‌బాబు, బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పుట్ట మధు నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో విస్తృతంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. మరోవైపు భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు ఇప్పటికే పలు దఫాలు అన్ని మండలాల్లో సుడిగాలి పర్యటనలు చేపట్టారు. భూపాలపల్లితో పాటు చిట్యాల ప్రాంతంలో కీలకమైన ఓటు బ్యాంకు ఉండటంతో మరింత ముందుకు సాగుతున్నారు. చిట్యాలలో మినీ క్యాంపు కార్యాలయాన్ని ఏర్పాటు చేసుకొని స్థానిక సంస్థల ఎన్నికల్లో ఆధిపత్యం చాటుకునేందుకు పట్టుదలగా వ్యూహాలకు పదును పెడుతున్నారని తెలుస్తోంది. మరోవైపు బీఆర్ఎస్‌లో మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డితోపాటు శాసనసభ మాజీ స్పీకర్, ప్రస్తుత శాసన మండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి ఎవరికి వారుగా ఆధిపత్యం చాటుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇందులో గండ్ర వెంకటరమణారెడ్డి మద్దతుదారులు కొంత చురుగ్గా గ్రామాల్లోకి వెళ్తుండగా మధుసూదనాచారి అనుచరులు ఇప్పుడిప్పుడే కార్యకలాపాలు ప్రారంభించారని తెలుస్తోంది. మొత్తమ్మీ ఇంకా నోటిఫికేషన్ వెలువడక ముందే పల్లెల్లో ఎన్నికల సందడి మాత్రం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది.

గుడుంబా విక్రేతలపై కేసు నమోదు

కన్నాయిగూడెం, జూలై 24 : గుడుంబా రవాణా చేస్తున్న బట్టాయిగూడెం గ్రామానికి చెందిన కల్వచర్ల రాజయ్య, కుమ్మరి నారాయణ, సునార్కని సత్యం, సంతోష్ ,దుర్గం మహేందర్, ఆసరెల్లి రవిపై కేసు నమోదూంది. వీరిని తహసీల్దార్ సర్వర్ ఎదుట గురువారం బైండోవర్ చేశారు. మళ్లీ గుడుంబా అమ్మినా, సరఫరా చేసినా రూ. లక్ష జరిమానా విధిస్తామని హెచ్చరించారు.

అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేయాలి : కలెక్టర్ దివాకర



విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న కలెక్టర్ దివాకర

గోవిందరావుపేట, జూలై 24 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేయాలని కలెక్టర్ టీఎస్.దివాకర ఉపాధ్యాయులకు సూచించారు. మండలంలోని పస్రా జడ్పీహెచ్ఎస్ పాఠశాలను ఆయన గురవారం ఆకస్మికంగా సందర్శించారు. ఈసందర్భంగా ఉపాధ్యాయుల హాజరు రిజిష్టర్, మధ్యాహ్న భోజనానికి సంబంధించి రిజిష్టర్లను పరిశీలించారు. అనంతరం 9,10తరగతుల విద్యార్థుల పఠనా సామర్థ్యాలను పరిశీలించి వంద శాతం ఉత్తీర్ణత సాధించాలన్నారు. వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారిపై ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు. ప్రతి పాఠశాలలో మౌలిక సౌకర్యాలు కల్పించాలన్నారు. విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని, పారిశుద్ధ్య నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలని అన్నారు.

విత్తనాలు అధిక ధరలకు అమ్మితే కఠిన చర్యలు

ఏటూరునాగారం రూరల్ (ఆంధ్రజ్యోతి): నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగుల మందులను రైతులకు అందుబాటులో ఉంచాలని, ఎరువు, పురుగుల మందులను అధిక ధరలను విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ దివాకర హెచ్చరించారు. మండలంలోని చిన్నబోయినపల్లిలో ప్రాథమిక సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎరువుల విక్రయ కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. క్రయ, విక్రయాలకు సంబంధించిన రికార్డులు, బిల్లులను పరిశీలించారు. జిల్లాలో రైతులకు సరిపడా ఎరువులు, పురుగు మందులు అందుబాటులో ఉన్నాయని, రైతులెవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అన్నారు. కలెక్టర్ వెంట ఏవో వేణుగోపాల్, పీఏఎస్‌సీ చైర్మన్ గౌరి, ఏఈవో రాజు ఉన్నారు.

గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు పనిచేయాలి

బీజేపీ జిల్లా అధ్యక్షుడు బలరాం



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు బలరాం

గోవిందరావుపేట, జూలై 24 (ఆంధ్రజ్యోతి): రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ గెలుపే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు పని చేయాలని ఆపార్టీ జిల్లా అధ్యక్షుడు సిరికొండ బలరాం పిలుపునిచ్చారు. గురువారం మండలంలోని పస్రాలో జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాబోయే ఎ్నకల్లో ప్రతిస్థానంలోబీజేపీ అభ్యర్థులను నిలబెట్టి ప్రధాని నరేంద్రమోడీ ప్రభుత్వం అమలుచేస్తున్న అభివృద్ధి పనులను ప్రజలకు వివరిస్తూ వారి గెలుపు కోసం కృషిచేయాలన్నారు. ఈ సమావేశంలో మండల ఇన్‌చార్జి కర్ర సాంబశివుడు, నాయకులు జినుకల కృష్ణాకర్‌రావు, కొత్త సురేందర్, చందా జ్యోతి, ఏనుగు రవీందర్‌రెడ్డి, కొత్త సుధాకర్‌రెడ్డి, మేరుగు సత్యనారాయణ, భైరి అశోక్, రాజన్న, మురళి, ఆకుల రవీందర్, వంగాల సోమిరెడ్డి, నాగేశ్వర్‌రావు, మధుసూదన్‌రెడ్డి, కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణే పోలీసుల లక్ష్యం : ఎస్పీ

వెంకటాపూర్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): శాంతిభద్రతల పరిరక్షణే పోలీసుల లక్ష్యమని ఎస్పీ శబరీశ్ అన్నారు. వార్షిక తనిఖీల్లో భాగంగా ఆయన స్థానిక పోలీస్‌స్టేషన్‌ను గురువారం సందర్శించారు. రిసెప్షన్ సెంటర్ పనితీరును, రికార్డులను పరిశీలించారు. ఫిర్యాదుదారులతో సిబ్బంది మర్యాదగా వ్యవహ రించాలన్నారు. ఫిర్యాదు అందిన వెంటనే విచారణ అధికారిని నియమించి అనంతరం ఆలస్యం చేయకుండా కేసు నమోదు చేయాలన్నారు. ప్రతి వర్టికల్‌కు ఒక అధికాని కేటాయించి ఎప్పటికప్పుడు రికార్డులు పెండింగ్‌లో లేకుండా పని పూర్తి చేయాలన్నారు. రోడ్డు ప్రమాదాలపై ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. గంజాయి వంటి మాదకద్రవ్యాల నిర్మూలనకు పటిష్ఠమైన చర్యలు చేపట్టాలన్నారు. ఆయన వెంట ములుగు డీఎస్పీ రవీందర్, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ శంకర్, ములుగు సీఐ సురేష్, స్థానిక ఎస్సై చల్ల రాజు, సిబ్బంది ఉన్నారు.

గర్భిణులకు బర్త్ వెయిటింగ్ రూం

వాజేడు, జూలై 24(ఆంధ్రజ్యోతి): వర్షాకాలంలో ప్రసవించేందుకు సిద్ధంగా ఉన్న గర్భిణులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా వాజేడులో నూతనంగా నిర్మించిన బర్త్ వెయిటింగ్ రూంను వైద్య ఆరోగ్యశాఖ ఏర్పాటు చేసింది. ఈ మేరకు గురువారం వైద్యాధికారి మధుకర్ ఇతర సిబ్బంది రూం పరిసరాలను శుభ్రం చేయించారు. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పీహెచ్‌సీ పరిధిలో ఉన్న గర్భిణులను అత్యవసర పరిస్థితుల్లో పీహెచ్‌సీకి తరలించేందుకు ఏర్పాట్లను చేస్తున్నారు. అదే విధంగా మురుమూరు జీపీలో ఇంటింటి జ్వర సర్వేను నిర్వహించారు. హెచ్ఎస్‌లు కోటిరెడ్డి, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

మంగపేట, జూలై 24 (ఆంధ్రజ్యోతి) ఉపాధ్యాయుల సమ్యలను పరిష్కరించాలని ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ (యూఎస్‌పీసీ) రాష్ట్ర నాయకులు గొప్ప సమ్మారావు, గడ్డి శ్రీనివాస్, నాగభూషణం, కొండ చెంచయ్య, పురుషోత్తంలు డిమాండ్ చేశారు. స్థానిక తహసీల్దార్ తోట రవీందర్‌కు ఈ మేరకు గురువారం వినతిపత్రం అందజేశారు. కొత్త ప్రభుత్వం ఏర్పడి 19 నెలలైనా ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించడంలో తీవ్ర జాప్యం చేస్తోందన్నారు. బదీలీలు, ప్రమోషన్ల షెడ్యూల్ విడుదల చేసి, ఈనెల చివరిలోగా ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్. సతీష్, చందు, రమేష్, భూలక్ష్మి, ద్రౌపతి రాంబాబు, నరేష్, నాగలక్ష్మి, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

మహదేవపూర్, జూలై 24(ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో డీటీఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయుల సమస్యలపై గురువారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా డీటీఎఫ్ మహదేవపూర్ మండల కమిటీ అధ్యక్షులు మడక మధు ఆధ్వర్యంలో సత్వరమే ఉద్యోగ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని నాయబ్ తహీల్దార్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు బి.తిరుపతిరెడ్డి, డీటీఎఫ్ రాష్ట్ర కమిటీ సభ్యులు బి.ప్రభాకర్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి ఇ.వీరేశం, పి.సమ్మయ్య, సాంబయ్య, ఆంజనేయులు, శ్రీనివాస్, లీలారాణి తదితరులు పాల్గొన్నారు.